www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. | సంపుటి : 02 | సంచిక : 183 | ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య | పేజిలు : 8 | వెల రూ. 2 | ఆదివారం -04 - అక్టోంబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

## సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి.. రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి

- ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌తో రైతులను సీఈఓలుగా మారుస్తామన్న అనంత్
- ఏపీలో రూ.1 లక్ష కోట్లతో సీబీజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్న రిలయన్స్
- ఏఐ, డ్రోన్ల టెక్నాలజీతో రైతులకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని వెల్లడి
- అనంత్ ప్రసంగానికి మంత్రముగ్ధులైన నేతలు



రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల తనకున్న అభిమానాన్ని, రాష్ట్ర అభివృద్ధికి చేయూతనివ్వాలన్న తన సంకల్పాన్ని బలంగా చాటిచెప్పారు. "నన్ను మీ ఆంధ్ర బిడ్డగా భావించండి. మిగతా 2లో

## భారత్ బద్నాం కాకుండా మీరే కాపాడారు! లేకుంటేనా..

- షైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకుని వందలాది మంది ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిట్ మచ్చార్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు.
- ఘటన మరోలా ముగిసి ఉంటే.. భారత్‌పై ఎలాంటి ముద్ర పడేదో ఊహించలేమంటూ ఆయన పేర్కొన్నారు.



షైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకుని వందలాది మంది ప్రాణాలను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిట్ మచ్చార్‌తో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మిగతా 2లో

## రాయలసీమ ప్రపంచ స్థాయి ఉద్యాన హబ్‌గా మారబోతోంది

### రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
- మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్
- రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది



రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మిగతా 2లో

## కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ.. రేవంత్‌కు చెమటలు పట్టిస్తాం



ఖైరతాబాద్‌లో వందశాతం మేమే గెలుస్తాం..

బీఆర్ఎస్ సభతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెమటలు పట్టిస్తామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.

త్వరలోనే కొడంగల్‌లో బీఆర్ఎస్ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్ : బీఆర్ఎస్ సభతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెమటలు పట్టిస్తామని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈరోజు(శుక్రవారం) మీడియాతో మిగతా 2లో

## స్థానిక ఎన్నికలను సాఫీగా జరిపించే ఉద్దేశం చంద్రబాబుకు లేదు

### గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రికి వైఎస్ జగన్ నివాళులు

- బాబు కుట్రలను దీటుగా ఎదుర్కొందాం
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు
- స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ రీజినల్ కో--ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో సుదీర్ఘ కసరత్తు
- జిల్లాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులపై నేతలతో సమగ్ర సమీక్ష



మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఇద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి మిగతా 2లో

## కరువు వేళ ఈవెంట్లు కాదు.. రైతులను ఆదుకోండి



- రాయలసీమ తీవ్ర కరువుతో అల్లాడుతుంటే చంద్రబాబు ఈవెంట్లతో కాలం గడుపుతున్నారని.. 'రైజింగ్ రాయలసీమ' ఈవెంట్లు ఎవరి కోసం అంటూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు.
- రైతుకు కావాల్సింది ఈవెంట్లు, పబ్లిసిటీ కాదు.. కష్టకాలంలో ప్రభుత్వ భరోసా. రైతులకు తక్షణమే రుణాల రీ షెడ్యూల్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందించాలి" అని డిమాండ్ చేశారు.

రాయలసీమ తీవ్ర కరువుతో అల్లాడుతుంటే చంద్రబాబు ఈవెంట్లతో కాలం గడుపుతున్నారని. మిగతా 2లో

## రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తాం

### కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది: చంద్రబాబు

- గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చూపిన మార్గంలో నడుద్దాం: సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్
- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య
- కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.
- అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు.
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు.
- రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు.




కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చామని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే మిగతా 2లో

## సుదీర్ఘకాలంగా అనధికార విధుల గైర్హాజరీ వైద్యులపై ప్రభుత్వ కొరడా



- 70 … వైద్యులకు ఉద్వాసన
- వివిధ దశల్లో మరో 193 మందిపై చర్యలు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్‌కు నివేదిక అందజేసిన డీఎస్‌హెచ్, డీఎంఈ అధికారులు
- గత మే నెలలోనే డిఎంఈ పరిధిలోం 51 మంది వైద్యుల తొలగింపు
- ఉపేక్షించొద్దని అధికారులకు మంత్రి స్పష్టమైన ఆదేశాలు

సుదీర్ఘకాలంగా విధులకు గైర్హాజరీలో ఉన్న 70 మంది వైద్యులను డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్) తొలగించింది. ఏడాదికిపైగా అనధికారికంగా విధులకు గైర్హాజరీలో మిగతా 2లో

## రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది



- బీజేపీలో చేరిన సీరియల్ నటులు.. ఆహ్వానించిన రాంచందర్ రావు
- బీజేపీలో చేరిన స్వర్ణలత తదితర నటులు
- సామాన్యులను కాంగ్రెస్, బీఆర్ఎస్ పట్టించుకోవడం లేదని రాంచందర్ రావు విమర్శ
- బీజేపీ గూటికి సీరియల్ ఆర్టిస్టులు.. ఆహ్వానించిన టీబీజేపీ చీఫ్

నగరంలోని బీజేపీ కార్యాలయంలో పలువురు సీరియల్ ఆర్టిస్టులు కాషాయం తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు.. టీవీ ఆర్టిస్ట్ వేములపల్లి స్వర్ణలత సహా పలువురు సీరియల్ ఆర్టిస్టులను పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడు తూ.. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మిగతా 2లో

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలి

### పాఠశాలల్లో అల్పాహార పథకం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన
- తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.
- శుక్రవారం ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు.
- నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు.
- సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది.



తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని స్పష్టం చేశారు. శుక్రవారం ముఖ్యమంత్రిని హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు జూబ్లీహిల్స్ నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా సీఎం సమక్షంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కోసం హరే కృష్ణ ఫౌండేషన్‌తో జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల మిగతా 2లో

## రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే హబ్ ప్రధాన లక్ష్యం



- సీమ స్వరూపాన్ని మార్చే గ్లోబల్ హార్టికల్చర్ హబ్.. రాయలసీమ రైతు సత్తా ప్రపంచానికి చూపిస్తాం
- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన
- హైదరాబాద్ ఐఎస్‌బీ తరహాలో సీమలో వ్యవసాయ విప్లవం సృష్టిస్తామని ధీమా
- యువగళం పాదయాత్రలో రైతుల కష్టాలు చూశాకే 'మిషన్ రాయలసీమ' ఆలోచన
- చంద్రబాబు ముందుచూపుతోనే సీమకు జలకళ
- ఆయనే అసలైన 'వాటర్ మ్యాన్' అన్న మంత్రి లోకేశ్

ఒకప్పుడు హైదరాబాద్‌లో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఎలాంటి అద్భుతాన్ని సృష్టించిందో, ఇప్పుడు అలాంటిదే రాయలసీమలో ఆవిష్కృతం కాబోతోందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మదనపల్లెలో ఏర్పాటు చేయబోతున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (జీహెచ్‌హెచ్), మిగతా 2లో

## సీఎం చంద్రబాబు గారూ.. 'నన్ను ఆంధ్రా బిడ్డగా భావించండి.. రాష్ట్రానికి ఏం చేయగలనో చెప్పండి

రాష్ట్రానికి నేనేం చేయాలో, ఏ సేవ అందించాలో మీరే మార్గనిర్దేశం చేయండి" అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన వినమ్రంగా కోరారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్, 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) శంకుస్థాపన కార్యక్రమంలో అనంత్ అంబానీ చేసిన ప్రసంగం సభికులను, వేదికపై ఉన్న ప్రముఖులను విశేషంగా ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ముగిసిన వెంటనే సీఎం చంద్రబాబు అనంత్‌ను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని అభినందించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కూడా ఆయన ప్రసంగాన్ని ప్రశంసించారు.ఈ సందర్భంగా అనంత్ అంబానీ మాట్లాడుతూ.. రాయలసీమలో ఏర్పాటవుతున్న హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. "ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కూడా ఉన్నత ప్రమాణాలతో ఎదుగుతుంది. ఈ సంస్థ ద్వారా అన్నదాతలను వారి కమతాలకే సీఈఓలుగా మారుస్తాం. ఆంధ్రభూమి స్వర్ణభూమిగా మారడం ఖాయం'' అని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కలలుగన్న 'వికసిత్ భారత్' స్వప్నాన్ని తనలాంటి యువత సాకారం చేసి చూపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## భారత్ బద్నాం కాకుండా మీరే కాపాడారు! లేకుంటేనా..

ఘటన మరోలా ముగిసి ఉంటే.. భారత్‌పై ఎలాంటి ముద్ర పడేదో ఊహించలేమంటూ ఆయన పేర్కొన్నారు. "మీరు అందరినీ కాపాడారు. చాలా గొప్ప పని చేశారు" అంటూ కెప్టెన్ మచ్చార్‌ను ప్రధాని మోదీ అభినందించారు. యూఏఈలో చికిత్స పొందుతున్న మచ్చార్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ.. "ఇలా జరగకపోయి ఉంటే.. భారత్ ఏం ఎదుర్కోవాల్సి వచ్చేదో, భారత పైలట్లు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చేదో, వారిని ప్రజలు ఎలా చూసేవారో ఎవరికి తెలుసు. మీరు అందరినీ కాపాడారు. మీరు చాలా గొప్ప పని చేశారు. భారత్, భారత పైలట్ల ప్రతిష్ఠను కాపాడారు" అని మోదీ వ్యాఖ్యానించినట్లు జాతీయ మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. తీవ్రంగా గాయపడినప్పటికీ మచ్చార్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తిని ప్రధాని ప్రశంసించారు. "దేశం మొత్తం మీ కోసం ప్రార్థిస్తోంది. మీ ఆరోగ్యం కోసం మహా మృత్యుంజయ జపం కూడా చేస్తున్నారు. మీ ధైర్యం, సమయస్ఫూర్తి, ప్రశాంతత ఎంతోమంది ప్రాణాలను కాపాడాయి. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు.. ఇతరులను కాపాడేందుకు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టేవారు అని దేశం గర్వంగా చెప్పుకోగలదు" అని మోదీ పేర్కొన్నారు. ఇదే సమయంలో.. సోషల్ మీడియాలో ఈ ఘటనపై జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఒమన్‌కు చెందిన కో-పైలట్ కెప్టెన్ మచ్చార్‌పై కత్తితో దాడి చేశాడు. ఆ తర్వాత విమానాన్ని కూల్చేయాలని అతను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.

## రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోంది

అక్రమ సంపాదనల విషయంలో ఒకదానిపై ఒకటి ఆరోపణలు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సంపాదించుకోవడం కాదు.. అసలు ప్రజలేం సంపాదించుకున్నారో ఎప్పుడైనా చెప్పారా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతి చిట్టా బయట పెడతామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులైనా.. ఒక్కరినైనా జైలుకు పంపలేదు. అవినీతికి పాల్పడడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్నాయి. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం కట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోంది. తమ సమస్యను పరిష్కరించాలని గాంధీ భవన్ వద్ద ధర్నా చేస్తున్న టీచర్లను అరెస్ట్ చేసింది. ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులను పట్టించుకోవాలి. బీఆర్ఎస్, కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారు. రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ పార్టీగా అవతరిస్తోంది' అని అన్నారు.తెలంగాణలో బీజేపీలో పలువురు టెలివిజన్ సీరియల్ కళాకారులు చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో టీవీ నటి వేములపల్లి స్వర్ణలతతో పాటు మరికొందరు సీరియల్ నటులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

## రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే హబ్ ప్రధాన లక్ష్యం

ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఏ) ఈ ప్రాంత వ్యవసాయ రంగ రూపురేఖలను సమూలంగా మార్చేస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మదనపల్లెలో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక సంస్థల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. "విత్తనం నుంచి ప్రపంచ స్థాయి ఉత్పత్తుల వరకు అన్ని దశల్లోనూ ఇక్కడ పరిశోధనలు జరుగుతాయి. ఉత్పాదకత, కోల్డ్ స్టోరేజ్, ప్యాకేజింగ్, యాంత్రీకరణ, జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం వంటి అంశాలపై దృష్టి సారిస్తాం. మన రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే ఈ హబ్ ప్రధాన లక్ష్యం. కేవలం ఇతర రాష్ట్రాలకు కాదు, ఇతర దేశాల మార్కెట్లకు అవసరమైన మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ వంటి మేలైన వంగడాలను పండించి, రాయలసీమ రైతు సత్తాను ప్రపంచానికి చాటి చెబుతాం" అని స్పష్టం చేశారు.యువగళం పాదయాత్రలో తాను 124 రోజుల పాటు రాయలసీమలో పర్యటించినప్పుడు రైతుల కష్టాలను కళ్లారా చూశానని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. "నాపై సోడా బాటిళ్లు, రాళ్లతో దాడులు చేసినా వెనక్కి తగ్గకుండా 1,587 కిలోమీటర్లు నడిచాను. ప్రతి రోజూ రైతులతో మాట్లాడి, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నాను. ఆ అనుభవంతోనే 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ' ప్రకటించాను. అందులో ప్రధానమైనదే ఈ హార్టికల్చర్ హబ్. ఆనాటి కల ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు సహకారంతో ఈరోజు నిజమవుతోంది" అని వివరించారు.రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబుకు రైతుల కష్టాలు బాగా తెలుసని లోకేశ్ అన్నారు. "ఈ మధ్య ఒక ఆంగ్ల పత్రిక చంద్రబాబును 'వాటర్ మ్యాన్' అని అభివర్ణించింది. అది చూసి గొడ్డలి పార్టీ నేతలు ఏడుస్తున్నారు. సీమ రైతులకు వరంలాంటి డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీని ఎత్తేసింది ఎవరు? పట్టిసీమతో ప్రయోజనం లేదన్నది ఎవరు? పోలవరం అర్థం కాలేదన్నది ఎవరు? అని నేను వారిని ప్రశ్నిస్తున్నాను. 1997లోనే ఇజ్రాయెల్ టెక్నాలజీతో సీమకు బిందు సేద్యాన్ని పరిచయం చేసి, కరవు నేలను సస్యశ్యామలం చేసిన ఘనత చంద్రబాబుది. తెలుగు గంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి వంటి ప్రాజెక్టులను దేవాలయాల్లా భావించి పూర్తి చేసే సంకల్పం ఆయనది. అందుకే ఆయన్ను అందరూ వాటర్ మ్యాన్ అంటున్నారు" అని లోకేశ్ పేర్కొన్నారు.

## కరువు వేళ ఈవెంట్లు కాదు.. రైతులను ఆదుకోండి

'రైజింగ్ రాయలసీమ' ఈవెంట్లు ఎవరి కోసం? అంటూ వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రైతుకు కావాల్సింది ఈవెంట్లు, పబ్లిసిటీ కాదు.. కష్టకాలంలో ప్రభుత్వ భరోసా. రైతులకు తక్షణమే రుణాల రీ షెడ్యూల్, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందించాలి" అని డిమాండ్ చేశారు."కేవలం 388 మండలాలకే కరువు పరిమితం చేయడం అన్యాయం. వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హమైన అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి. జూన్ నుంచే వర్షాభావ పరిస్థితులు ఉన్నా సెప్టెంబరు చివరి వరకు కరువు ప్రణాళిక ఎందుకు సిద్ధం చేయలేదు?. వేల ఎకరాల్లో చీనీ సహా పండ్ల తోటలు ఎండిపోతున్నాయి. రైతులు లక్షలు ఖర్చుపెట్టి కొత్త బోర్లు వేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. టమోటా, అరటి, బత్తాయి, ఉల్లి రైతులకు గిట్టుబాటు ధరలు లేవు. ఈ రెండేళ్లలో ఉద్యాన రంగానికి ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలి" అంటూ కన్నబాబు నిలదీశారు.'వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంటే ఇప్పుడు 'హబ్‌లు ఏర్పాటు చేస్తాం' అంటూ కొత్త ప్రకటనలు చేయడం వల్ల రైతుకు తక్షణ ప్రయోజనం ఏమిటి?. గతంలో అనేక ప్రాజెక్టులు రాష్ట్రానికి వస్తున్నాయని ప్రచారం చేశారు. ప్రకటించిన వాటిలో ఎన్ని ప్రాజెక్టులు వాస్తవంగా గ్రౌండ్ అయ్యాయో ప్రభుత్వం చెప్పాలి. చంద్రబాబును 'వాటర్ మ్యాన్' అని పొగిడే వారు ఒక్కసారి రాయలసీమలో ఎండిపోయిన పొలాలు, రైతుల కష్టాలను చూడాలి. విశాఖకు తన ప్రార్థనల వల్లే వర్షం వచ్చిందని చంద్రబాబు చెప్పుకున్నారు. అదే నిజమైతే నాలుగు నెలల ముందే ప్రార్థించి కరువును ఎందుకు నివారించలేకపోయారు?" అంటూ కన్నబాబు ప్రశ్నించారు."ఇప్పుడు 'రోడ్డు డాక్టర్లు' అంటున్నారు.. ముందు 'కరువు డాక్టర్లను' తీసుకొచ్చి రైతులను దుర్భిక్షం నుంచి బయటపడేయండి. ఈవెంట్లతో కరువు పోదు.. పబ్లిసిటీతో రైతు కష్టాలు తీరవు. 'రైజింగ్ రాయలసీమ' అని పేరు పెట్టడం కాదు.. కరువుతో కుంగిపోతున్న రాయలసీమ రైతును కాపాడండి" అని కన్నబాబు హితవు పలికారు.

## సుదీర్ఘకాలంగా అనధికార విధుల గైర్హాజరీ వైద్యులపై ప్రభుత్వ కొరడా

ఉన్న వీరికి ప్రభుత్వ సివిల్ సర్వీసు నిబంధనల ప్రకారం సంజాయిషీ నోటీసులు జారీ చేసి, ఇతర నిబంధనలను అనుసరించి చివరి చర్యగా విధుల నుంచి తప్పించాలని శాఖాపరంగా నిర్ణయించినట్లు అధికారులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్‌కు వివరించారు. రూల్ నంబర్ 20 ఆఫ్ ఏపీసీఎస్ (సీసీఏ) రూల్స్-1991 అనుసరించి వీరిపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ హోదాలో ఉన్న వీరిలో గైనిక్, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, ఇతర స్పెషాల్టీ వైద్యులు ఉన్నారని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు తెలిపారు.ఏఎస్‌హెచ్ పరిధిలోనే మరో 154 మంది వైద్యులు అనధికారికంగా విధులకు గైర్హాజరీలో ఉన్నారు. వీరి విషయంలోనూ నిబంధనలను అనుసరించి సంజాయిషీ నోటీసులను జారీ చేశారు. తదుపరి చర్యలు వివిధ దశల్లో ఉన్నాయి. నోటీసుల అనంతరం విధుల్లో చేరేందుకు ముందుకొస్తే ఇంక్రిమెంట్లలో కోత వంటి క్రమశిక్షణా చర్యలను అనుసరించి అవకాశాలను కల్పిస్తున్నారు. ఇలా డీఎస్‌హెచ్ పరిధిలో అంతకుముందు 78 మంది వైద్యులు విధుల్లో చేరారు.డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో పనిచేస్తూ విధులకు హాజరుకాని 39 మంది వైద్యులకు ప్రభుత్వం తుది అవకాశం కల్పించింది. ఎలాంటి అనుమతి లేకుండా ఏడాదికి పైగా, రెండేళ్లలోపు కాలంగా విధులకు గైర్హాజరవుతున్న వీరికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించలేదు. విధుల్లోనూ చేరలేదు. సర్వీస్ నిబంధనలను అనుసరించి వీరికి తుదిగా అవకాశం కల్పిస్తామని, స్పందన లేకుంటే విధుల నుంచి తప్పిస్తామని డీఎంఈ డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. గైర్హాజరైన 39 మంది వైద్యుల్లో ఐదుగురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 30 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. సంబంధిత అధికారులు మంజూరు చేసిన సెలవులు లేకుండానే వీరు విధులకు దూరంగా ఉన్నారు.

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలి

ఏర్పాటు కోసం ఈ సంస్థలు సహకారం అందించనున్నాయి. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్‌లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ కోసం రూ. 5.17 కోట్ల చెక్కును సీఎం చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు జున్నా సోలార్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈవో అనిల్ బాబు అందజేశారు.అలాగే, వికారాబాద్‌లో ఆధునిక సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రూ.4 కోట్ల చెక్కును హరే కృష్ణ ఫౌండేషన్‌కు చైన్ ల్యాబ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి సమంత డే, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ అందించారు. నిధులు అందించిన సంస్థల ప్రతినిధులను రేవంత్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల ట్రాక్ రికార్డును నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల శారీరక పెరుగుదల, విద్యా పురోగతి వంటి అంశాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలని సూచించారు. ఆహారంలో ఇచ్చే పదార్థాల క్యాలరీలను లెక్కించడానికి యాప్‌లను ఉపయోగించుకోవాలని తెలిపారు.బ్రేక్‌ఫాస్ట్ వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలకు చేరుకుంటారని సీఎం అన్నారు. ఆహార నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రాంతాల వారీగా అక్కడి అలవాట్లకు అనుగుణంగా బ్రేక్‌ఫాస్ట్ తయారు చేయాలన్నారు. సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తామని చెప్పారు. జీవితకాలం కొనసాగే కార్యక్రమం ఇదని.. కాబట్టి అత్యంత జాగ్రత్త వహించాలని వెల్లడించారు. నవంబర్ 30లోగా సెంట్రల్ కిచెన్లు పూర్తి అయ్యేలా చూడాలని.. డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి సెంట్రల్ కిచెన్ల ప్రారంభమవ్వాలని ఆదేశించారు. సెంట్రల్ కిచెన్లను విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, హరే కృష్ణ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి.జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకు?న్నారు. త్వరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగులు, పెన్షనర్ల రెండు డీఏలకు తెలంగాణ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.గట్టు ప్రాజెక్టు నిర్మాణానికి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. ఇందిరా సాగర్ ఫ్లడ్ ఫ్లో కెనాల్ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. బాచారం హైలెవల్ కెనాల్ నిరమాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2జీ బార్లలో అడిషనల్ ప్రివిలేజ్ ఫీజు పెంచాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. గతంలో ఉన్న నిబంధనలను సడలించాలని నిర్ణయించింది. వైన్ తయారీ కంపెనీల నుంచి వెయ్యి రూపాయల ఫీజు వసూలు చేసేందుకు సన్నాహాలు చేసుకోవాలని నిర్ణయం తీసకుంది. ఫారెన్ లిక్కర్ బేస్ ప్రైస్ కమిటీ 2023 రిపోర్టు అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.

## రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తాం

సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని, ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు.ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.అన్నమయ్య జిల్లా: రాయలసీమను రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లెలో రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు ఈరోజు (శుక్రవారం) శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, అనంత్ అంబానీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు.

అనంత్ అంబానీ తెలుగు బిడ్డ..

'ఇవాళ్టి నుంచి అనంత్ అంబానీ తెలుగు బిడ్డ.. మనందరి ముద్దు బిడ్డ' అని ప్రశంసించారు. అనంత్ అంబానీ ఏ ప్రాజెక్ట్ చేపట్టినా విజయవంతం చేస్తారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ప్రజల ఉత్సాహం అదిరిపోయిందని అన్నారు. కరువుసీమలో గొప్ప కార్యక్రమం చేపట్టామని వివరించారు. కరువు సీమ.. సిరుల సీమ అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా మార్చబోతున్నామని ఉద్ఘాటించారు. అన్నదాతకు ఉపయోగపడేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఏపీ అభివృద్ధికి నిర్మలా సీతారామన్ సహకరిస్తున్నారు..

అక్టోబర్ 2, 2026 రాయలసీమ చరిత్రలో నిలిచిపోతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ అభివృద్ధికి కారణం మీరిచ్చిన విజయమేనని చెప్పారు. ఏపీ అభివృద్ధికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ సహకరిస్తున్నారని తెలిపారు. ఏది కావాలని కోరినా అన్నింటికీ ఆమె డబ్బులు ఇస్తున్నారని ప్రశంసించారు. విశాఖపట్నం ఉక్కుకు డబ్బులిచ్చి నిలబెట్టారని కొనియాడారు. సాగునీరు ఇస్తే రాయలసీమ ప్రజలు బంగారం పండించగలరని వెల్లడించారు. యాపిల్ నుంచి స్ట్రాబెర్రీ వరకు రాయలసీమ రైతులు పండించగలరని తెలిపారు. అప్పట్లో తనను జజూా అని, హైటెక్ సీఎం అని అనేవాళ్లని ప్రస్తావించారు. ఇప్పుడు వాటర్‌మెన్ అంటుంటే సంతోషంగా ఉందని అన్నారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ వ్యవసాయంలో పెనుమార్పులు తీసుకువస్తున్నామని వెల్లడించారు. ××వీలో మేనేజ్‌మెంట్ లీడర్లు,.. ×× టెక్నాలజీ నిపుణులు తయారవుతారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారుజాతిపిత మహాత్మా గాంధీ, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి నేడు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా వారు పోస్టు పెట్టారు.జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా, ఆ మహనీయునికి నా వినయపూర్వక నివాళులు అర్పిస్తున్నానని సీఎం చంద్రబాబు తెలిపారు. 'సత్యం, అహింస, పరిశుభ్రత, గ్రామ స్వయం పరిపాలన వంటి గాంధీ ఆదర్శాలు నేటికీ మనకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు, ప్రజలను ఏకం చేసి నడిపించిన తీరు శాశ్వతంగా స్మరణీయం. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, స్వయం సమృద్ధిగల, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించేందుకు మనమందరం కృషి చేద్దాం. భారతదేశ నిర్మాణంలో భాగంగా, అభివృద్ధి చెందిన భారతదేశం, స్వర్ణాంధ్ర కోసం గాంధీజీ చూపిన మార్గంలో నడుద్దాం' అని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

లాల్ బహదూర్ శాస్త్రి నిరాడంబరతకు ప్రతీక: సీఎం చంద్రబాబు

భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. 'స్వతంత్ర భారతదేశపు రెండో ప్రధానమంత్రి, భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి 122వ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. ఆయన నిరాడంబరతకు ప్రతీక, దేశభక్తి, నిజాయితీకి ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆ మహనీయుని సేవలను స్మరిస్తూ నివాళులు అర్పిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'ప్రపంచంలో మీరు చూడాలనుకుంటున్న మార్పు మీరే అవ్వండి. గాంధీ జయంతి సందర్భంగా, సత్యం, అహింస, నిస్వార్థ సేవ పట్ల అచంచలమైన విశ్వాసంతో ఒక జాతికి స్ఫూర్తినిచ్చి, తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్న మహాత్మా గాంధీజీకి నివాళులు అర్పిస్తున్నాను.

## రాయలసీమ ప్రపంచ స్థాయి ఉద్యాన హబ్‌గా మారబోతోంది

ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.రాయలసీమ గడ్డ త్వరలోనే ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా అవతరించబోతోందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె వేదికగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్'తో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్న 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు నేతలు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ.. రూ.లక్ష కోట్ల భారీ పెట్టుబడితో రాయలసీమలో ఉద్యానవన విప్లవానికి నాంది పలికామని, సీమ రైతుల దశను మార్చే చారిత్రాత్మక ఘట్టం ఇదని కొనియాడారు.రాయలసీమ రైతుల్లో అపారమైన పట్టుదల, కష్టపడే తత్వం ఉన్నాయని.. వారికి ప్రభుత్వ తోడ్పాటు, సాంకేతికత అందితే అద్భుతాలు సృష్టిస్తారని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఉద్యాన పంటల సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు, కరవు ప్రాంతమైన సీమలో నీటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అత్యాధునిక సూక్ష్మ సేద్యం ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని వివరించారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ భారీ ప్రాజెక్టుల ద్వారా రాయలసీమ ఉమ్మడి జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భరోసా దక్కుతుందని, దేశ వ్యవసాయ రంగంలోనే మదనపల్లె ప్రాజెక్టు ఒక రోల్ మోడల్‌గా నిలవనుందని పవన్ కల్యాణ్ ధీమా వ్యక్తం చేశారు. మంత్రి ప్రారంభించారు. ఒక్కో రేషన్ కార్డుదారుడికి రెండు కిలోల చొప్పున ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.కూటమి ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి నాదెండ్ల ఉద్ఘాటించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిణామాలతో ధరలు పెరుగుతున్నాయని వివరించారు. ప్రజలపై భారం పడకుండా సబ్సిడీపై అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. ధరల స్థిరీకరణకు నిధిని ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని తెలిపారు.

## స్థానిక ఎన్నికలను సాఫీగా జరిపించే ఉద్దేశం చంద్రబాబుకు లేదు

ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వెల్లంపల్లి శ్రీనివాస్, రాయన భాగ్యలక్ష్మి, దేవినేని అవినాష్, ఎంపీ మిథున్‌రెడ్డి, పూనూరి గౌతమ్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా..'అహింసా మార్గంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ. 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో దేశానికి స్ఫూర్తినిచ్చిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి. వారిద్దరి పోరాటం, త్యాగం తరతరాలకు ఆదర్శనీయం. ఈ మహనీయుల జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను' అని పోస్టు చేశారు. అహింసా మార్గంలో దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ గారు, 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో దేశానికి స్ఫూర్తినిచ్చిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి గార్ల పోరాటం, త్యాగం తరతరాలకు ఆదర్శనీయం. ఈ మహనీయుల జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్నాను.స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలను దీటుగా ఎదుర్కొందామని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అన్నివర్గాల ప్రజలు చంద్రబాబు పాలనపై ఆగ్రహంతో ఉండటంతో స్థానిక ఎన్నికలను సజావుగా జరిపించే ఉద్దేశం ఆయనకు లేదని చెప్పారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా పార్టీ నేతలు, శ్రేణులు ధైర్యంగా నిలబడాలని దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసే దిశగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్తృత కసరత్తు చేపట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, వెన్నుపోటు పార్టీ ప్రభుత్వం దౌర్జన్యాలను ఎదుర్కోవడంపై పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం పార్టీ రీజినల్ కో--ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, ముఖ్య నేతలతో ఆయన ముఖాముఖి సమావేశమయ్యారు. జిల్లాలవారీగా క్షేత్రస్థాయిలో పరిస్థితులపై సుదీర్ఘంగా, సమగ్రంగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలం, ఎన్నికల సన్నాహాలు, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై నేతలతో విస్తృతంగా చర్చించారు.జిల్లాల అధ్యక్షులు, రీజినల్ కో--ఆర్డినేటర్లతో వైఎస్ జగన్ జిల్లాల వారీగా సమీక్షించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తగిన అభ్యర్థుల ఎంపికలో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నారని, స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ అన్నివిధాలుగా సన్నద్ధంగా ఉందని పార్టీ నేతలు వైఎస్ జగన్‌కు వివరించారు. వెన్నుపోటు పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, పాలన, స్థానిక సమస్యలు తదితర అంశాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని పలువురు నేతలు వివరించారు. ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే పార్టీదే విజయమని చెప్పారు. స్థానిక ఎన్నికల అంశం తెరపైకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు అధికార పార్టీ నుంచి బెదిరింపులు వస్తున్నాయని పలువురు నాయకులు వైఎస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు. పోలీసు వ్యవస్థ దుర్వినియోగం కొనసాగుతోందని, ఎన్నికల్లో పోటీకి అవసరమైన సర్టిఫికెట్ల జారీలో కూడా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వంపై నానాటికీ పెరుగుతున్న అసంతృప్తిని ప్రజాక్షేత్రంలో ఎదుర్కోలేక విపక్షంపై దౌర్జన్యాలకు దిగుతున్నారని వివరించారు.నేతల ద్వారా క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్న వైఎస్ జగన్ మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలను సాఫీగా జరిపించే ఉద్దేశం చంద్రబాబుకు లేదని చెప్పారు. చంద్రబాబు మోసాలు, దౌర్జన్యాలు, స్కామ్‌లు, అరాచకాలపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు.

## కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ.. రేవంత్‌కు చెమటలు పట్టిస్తాం

నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. త్వరలోనే కొడంగల్‌లో బీఆర్ఎస్ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఎక్కడైనా పర్యటించవచ్చని.. సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం లేదన్నారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా అని ప్రశ్నించారు. రేవంత్.. సిద్దిపేటలో కూడా సభ పెడతానంటున్నారని అన్నారు. సిద్దిపేట సభ తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని ప్రకటించారు. సిరిసిల్ల సభతో రేవంత్‌కు వచ్చిన మైలేజ్ కంటే నష్టమే ఎక్కువన్నారు.తాము కొడంగల్‌లో పెట్టే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పడతాయని తలసాని అన్నారు. ఖైరతాబాద్ బైపోల్స్‌లో వంద శాతం బీఆర్ఎస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలు మారటంతో దానం నాగేందర్‌పై ఖైరతాబాద్ ఓటర్లు ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు. గతంలో ఓటు హక్కు వినియోగించుకోని వారు కూడా బైపోల్స్‌లో కసితో ఓటు వేస్తారన్నారు. జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉపఎన్నిక పరిస్థితి వేరని చెప్పుకొచ్చారు. డబ్బులు ఇచ్చినా ఈసారి ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేయరన్నారు. 'అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసేంత సీన్ మేము ఏం చేశాం? బయట జరిగిన గొడవకు స్పీకర్‌కు ఏం సంబంధం' అని తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.హైదరాబాద్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజవర్గం ఉప ఎన్నికల్లో కచ్చితంగా తామే గెలుస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.వందకు వందశాతం తామే గెలుస్తామన్నారు. ఉప ఎన్నికల్లో ప్రభుత్వ పార్టీకి కొంత అడ్వాన్స్ ఉంటుదనే మాట వాస్తవమే కావొచ్చు కానీ తాము ఇక్కడ గెలిచి చూపెడాతామన్నారు తలసాని.అక్కడ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడిన సందర్భంలో ఓటర్లు కూడా ప్రతిపక్ష పార్టీ పట్టం కడతారన్నారు. ఖైరతాబాద్ నియోజవర్గం అనేది ప్రత్యేకమైన నియోజకవర్గమన్నారు తలసాని. మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా తలసాని మాట్లాడుతూ.. సీఎం రేవంత్ సిరిసిల్ల పర్యటన ద్వారా ప్రభుత్వంపై చాలా వ్యతిరేకత వచ్చిందన్నారు.'సీఎం రేవంత్ సిరిసిల్ల పోయాడు.. సిద్దిపేట పోత అంటున్నాడు.. తర్వాత మేము కొడంగల్‌లో సభ పెడతాం. రానున్న రోజుల్లో కరెంట్ కోతలు తీవ్రంగా రానున్నాయి.దేశ రాజకీయాల్లో సెంటిమెంట్ చాలా పని చేస్తోంది. మొన్న మాక్ అసెంబ్లీ పెడితే ఏం జరిగింది చూశాం. మాజీ ముఖ్యమంత్రి ఇంటి మీదకు భూ సర్వే కు పంపిస్తారా?, కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి ఎంపీలు వెళతారా?' అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా చాటిచెప్పిన పోరాట రూపం సాగరహారమని అన్నారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్య తీవ్రంగా కలచివేసింది.. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదు:- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్ ): పూడూరు మండలంలోని మాటుగూడెం గ్రామానికి చెందిన మమత తన ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆత్మహత్య ఏ సమస్యకూ పరిష్కారం కాదని, ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు.ఆర్థికపరమైన ఇతర ఏ సమస్య ఉన్నా తనను సంప్రదించాలని,సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు.మృతుల కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం,ఆత్మస్థైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తాచాటాలి

-పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి నివాసం వద్ద బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్ధం అవ్వాలని, పార్టీ నాయకులకు పిలుపును ఇచ్చారు. విద్యావంతులు ప్రభుత్వం మీద అసంతృప్తితో ఉన్నారని, బిఆర్ఎఫ్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్ రెడ్డి, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు మీర్ మహమూద్ అలీ, మాజీ జెడ్పిటిసి నాగిరెడ్డి, మాజీ ఎంపీపీ లు అరవింద్ రావు, మల్లేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్, కౌన్సిలర్ లు తాహీర్ అలీ, రవి, రవీంద్ర, శ్రీనివాస్, మాజీ దోమ సర్పంచ్ల సంఘం అధ్యక్షులు రాజిరెడ్డి, హనుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రూఫ్ ఖాన్‌పేట్, బాబాపూర్‌లో సేవా సంపర్క అభియాన్



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: సేవా సంపర్క అభియాన్ కార్యక్రమంలో భాగంగా పరిగి మండల బిజెపి అధ్యక్షురాలు అనసూయ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో రూఫ్ ఖాన్‌పేట్, బాబాపూర్ గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ టీచర్లకు ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ సందర్భంగా అనసూయ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ద్వార అంగన్వాడీ కేంద్రాలకు అందుతున్న పౌష్టికాహారం అర్హులైన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బాలామృతం, గుడ్లు, పాలు, మురుకులు తదితర పౌష్టికాహార పదార్థాలను కేంద్రాల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పొందుతున్న లబ్ధిదారులు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పరిగి అసెంబ్లీ కన్వీనర్ నరసింహ, బీజేపీ నాయకులు సుధాకర్, శేఖర్, నవీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో అగ్నిప్రమాదం.. ఎమ్మెల్యేకు గాయాలు, ఆసుపత్రికి తరలింపు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా ధులియాన్‌లో శనివారం ఉదయం సాగర్‌దిఘి నియోజకవర్గ ఎమ్మెల్యే బైరన్ బిశ్వాస్ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే బైరన్ బిశ్వాస్ గాయపడ్డారు. మంటల కారణంగా ఆయన శరీర దిగువ భాగంలో కాలిన గాయాలు కనపడినట్లు స్థానికులు తెలిపారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆయన పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉంది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో కుటుంబంలోని ఇతర సభ్యులు ఇంట్లో ఉన్నప్పటికీ ఎవరికీ గాయాలు కాలేదు. ఇంటి నుంచి భారీగా నల్లటి పొగ వెలువడటాన్ని స్థానికులు గమనించారు. గాయపడిన బైరన్ బిశ్వాస్‌ను తొలుత ధులియాన్‌లోని కుటుంబానికి చెందిన నర్సింగ్‌హోమ్‌కు తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ముర్షిదాబాద్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు తరలించే అవకాశం ఉందని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అగ్నిప్రమాదం ఎలా మొదలైంది, బైరన్ బిశ్వాస్‌కు ఏ విధంగా గాయాలు అయ్యాయన్నది ఇప్పటివరకు స్పష్టంగా తెలియలేదని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. బైరన్ బిశ్వాస్ ఇటీవల రాజకీయ పరిణామాల కారణంగా కూడా వార్తల్లో నిలిచారు. ఆయన రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు ఆయన ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఈ ఘటనపై స్పందిస్తూ.. "నేను తెలుసుకుంటాను. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను" అని మీడియాతో అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధురి స్పందిస్తూ.. "నేను చాలా ఆందోళన చెందుతున్నాను. ఆసుపత్రికి వెళ్తాను. ఆయన త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తాను" అని తెలిపారు. ప్రస్తుతం బైరన్ బిశ్వాస్ ఆరోగ్య పరిస్థితిపైనే ప్రధానంగా దృష్టి ఉంది. అదే సమయంలో అగ్నిప్రమాదానికి కచ్చితమైన కారణాన్ని నిర్ధారించాల్సి ఉంది.

## 'ఆమ్ ఆద్మీ'కి షాక్: కాంగ్రెస్‌లో చేరిన ప్రియాంక కక్కర్



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ప్రధాన జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆప్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు రాజీవ్ శుక్లా, పవన్ ఖేడా, దేవేందర్ యాదవ్ సమక్షంలో ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆమెతో పాటు మాజీ ఎమ్మెల్యే శ్యామ్ సుందర్ శర్మ, రజత్ రాకేశ్ టండన్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ, తాను చిన్నప్పటి నుంచి చూసిన పరిశుభ్రమైన, పచ్చని, సురక్షితమైన ఢిల్లీని మళ్లీ కాంగ్రెస్ మాత్రమే తీసుకురాగలదని, రాజకీయాల్లో నిజాయితీగా నిలబడే ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ మాత్రమే అని పేర్కొన్నారు. ఇదే సమయంలో ఆప్ తన మూల సిద్ధాంతాల నుంచి తప్పుకుందని, బంగ్లాలు, కార్లు వద్దన్నవారే ఇప్పుడు వ్యక్తిగత ప్రయాణాలకు చాపర్లు వాడుతున్నారని, పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి కొత్తవారికి పెద్ద పదవులు కట్టబెడుతున్నారని

# కాంగ్రెస్ హయాంలోనే పేద ప్రజలకు న్యాయం

-మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు

పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తున్నది.......

పరిగి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు మన ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి

ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చెక్కులు అందజేసిన మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు

ఎమ్మెల్యే ఆదేశాల మేరకు లక్ష్మీదేవి పల్లి, నారాయణపూర్ గోవిందా పూర్ తండాకు చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ కార్డు చెక్కులు అందజేసిన మండల పార్టీ అధ్యక్షుడు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్):: కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ అధికారంలోకి వచ్చినా నిరంతరం పేద ప్రజల కోసం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని పరిగి మండల పార్టీ అధ్యక్షుడు జీ వెంకట రాములు అన్నారు. శనివారం పరిగి మండల పరిధిలోని లక్ష్మీదేవి పల్లి గ్రామంలో స్మార్ట్ కార్డులు, నారాయణపూర్ లో స్మార్ట్ కార్డు అదేవిధంగా ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని, గోవిందా పూర్ తండాకు చెందిన వ్యక్తులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అధికారంలోకి వచ్చిన పేద ప్రజల సంక్షేమం ప్రతి గ్రామంలో అభివృద్ధి ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తారని పేర్కొన్నారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల గురించి నిరంతరం పనిచేస్తుందని ఇప్పుడు మన ప్రియతమ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి యనమల రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద



ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం పేద ప్రజల ప్రతి గడప తట్టే విధంగా కృషి చేస్తున్నారని ప్రతి నియోజకవర్గంలో మండల నాయకులు గ్రామ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి పేదవాడికి అందే విధంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందినప్పుడే ప్రభుత్వం సమర్థవంతంగా ముందుకు సాగుతుందని అందుకే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని పూర్తిస్థాయిలో గ్రామాలలో ముందుకు వెళ్లేందుకు నాయకులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఉన్న అర్హులైన ప్రతి పేద వాడికి అందే విధంగా మన పరిగి ఎమ్మెల్యే ప్రియతమ నాయకుడు టి రామ్మోహన్ రెడ్డి మండల సాయి నాయకులను గ్రామస్థాయి నాయకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ప్రతి సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందే విధంగా నిరంతరము మండల నాయకులకు ఆదేశాలు జారీ చేస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందే విధంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈరోజు పరిగి మండల పరిధిలోని అన్ని గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రతి గ్రామంలోని అర్హులైన ప్రతి పేదవాడి ఇంటికి అందే విధంగా కృషి చేయడం జరుగుతున్నదని అందులో భాగంగానే ఈరోజు గ్రామ గ్రామం తిరిగి స్మార్ట్ కార్డులు అందజేస్తూ అర్హులైన వారు ఇంకా గ్రామంలో ఎవరైనా ఉన్నారా? తెలుసుకుంటూ అటువంటి వారు ఉంటే వెంటనే వారి పేరు నమోదు చేసుకొని స్థానిక ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే వారికి సంక్షేమ పథకం అందే విధంగా కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి వెళ్లి గ్రామాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని గ్రామంలో అడిగి తెలుసుకోవడం జరుగుతున్నదని ఎవరైనా సంక్షేమ పథకాలు ఇంకా అందాలని అర్హులైన వారు ఉన్నారని తెలియజేస్తే వెంటనే వారికి వచ్చే విధంగా కృషి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# ఉన్నత 'మిథ్య'



దేశవ్యాప్తంగా ప్రభుత్వాలనుంచి తీవ్ర ప్రతిఘటన వస్తున్నా, ఒక్కోసారి దౌర్జన్యం జరుగుతున్నా కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కార్యకర్తలు ప్రాథమిక పాఠశాలలు సందర్శించి అక్కడి దారుణ పరిస్థితుల్ని చాటుతున్నారు. ఉన్నత విద్య సైతం ఈ దేశంలో అలాగే అఘోరించిందని ఇటీవల విడుదలైన ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక కుండబద్దలుకొట్టింది. ఒకపక్క ప్రపంచంలో ఏ దేశానికీ లేని స్థాయిలో మనకు యువశక్తి పుష్కలంగా ఉన్నదని డబ్బా కొట్టుకొంటున్నా... ఆ యువత తమ సత్తా చాటడానికి అవసరమైన సదుపాయాలేమీ లేవని సీజేపీ విడుదల చేస్తున్న వీడియోలు, ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక ఏక కంఠంతో చెబుతున్నాయి. మరి స్వాతంత్ర్యానంతరం ఇన్ని దశాబ్దాల్లో ప్రభుత్వాలు ఏం సాధించినట్టు? మనది శరవేగంతో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అని మొన్న జూలైలో అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్) సంస్థ ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మన వృద్ధి రేటు 7.8 శాతం. రిజర్వ్ బ్యాంక్ అంచనా 7.0 శాతం కన్నా ఇది అధికం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో ప్రస్తుతం మనం ఆరో స్థానంలో ఉండగా... మరో పాతికేళ్లలో భారత్ తొలి స్థానానికి ఎగబాకుతుందని అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీ ఆర్థికవేత్త జెఫ్రీ శాక్స్ ఇటీవల అంచనా వేశారు. గర్వపడాల్సిందే. కానీ ప్రాథమిక విద్య మొదలు ఉన్నత విద్య వరకూ అంతా నాసిరకంగా ఉన్నప్పుడు ఇదంతా ఎలా సాధ్యమన్న ప్రశ్న ఎవరికైనా వస్తుంది... పాలకులకు తప్ప! మనం అమెరికా, చైనాలను అధిగమించబోయే క్రమంలో ఉన్నాంగనుక ఆ రెండు దేశాల్లోనూ విద్యావ్యవస్థలెలా వున్నాయో తెలుసుకోవటం అవసరం. అమెరికా యూని వర్సిటీలు 2024లో ఉన్నత విద్యకు సంబంధించిన పరిశోధన, అభివృద్ధి కోసం 11,770 కోట్ల డాలర్ల నిధులు పొందాయని ఒక నివేదిక చెబుతోంది. ఇందులో ప్రభుత్వాలనుంచి వచ్చింది 6,460 కోట్ల డాలర్లు. మన దగ్గర ప్రభుత్వాలే కాదు... వాటినుంచి ఎకరా 99 పైసలకు వందల ఎకరాలు పొందే ప్రైవేటు సంస్థలు సైతం ఉన్నత విద్యకు నిధులు రాల్చటం లేదని దీన్నిబట్టి తెలుస్తుంది. చైనాలో పరిశోధన, అభివృద్ధి రంగాలకు 2024లో కేటాయించిన మొత్తం దాని వృద్ధి రేటులో 2.69 శాతం. అదే కాలంలో ఉన్నత విద్యారంగంలో మన వ్యయం జీడీపీలో కేవలం 0.84 శాతం. ఉన్నత విద్య వరకూ అన్ని దశలూ ప్రజలకు అందుబాటులో ఉండటం, మౌలిక సదుపాయాలపై అపారంగా వ్యయం చేయటం, వ్యూహాత్మక పరిశోధనకు పెద్ద మొత్తంలో నిధులు వ్యయం చేయటం, పటిష్టమైన ప్రభుత్వ సమన్వయం చైనా ప్రత్యేకతలు. మనం ఆ స్థాయికి చేరుకోవటానికి ఎన్ని దశాబ్దాలు పడుతుంది? మన యూనివర్సిటీలు, కళాశాలలు... వాటిల్లో చేరే విద్యార్థుల సంఖ్య గత కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగిన మాట వాస్తవమే అయినా, వీరికి బోధించేందుకు అవసరమైన సిబ్బంది లేరు. దాదాపు మంజూరైన అధ్యాపక పోస్టుల్లో అన్నిచోట్లా మూడోవంతు ఖాళీగా పడివున్నాయి. ప్రస్తుత ఉన్నత విద్యా సంస్థల సంఖ్య 64,756 కాగా, 2014తో పోలిస్తే వీటి వృద్ధి 47 శాతం. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 4.5 కోట్లు. అధ్యాపకులసంఖ్య కూడా 2013--14 మధ్య ఉన్న 13.7 లక్షలనుంచి 17.3 లక్షలకు చేరింది. కానీ ఇంకా 34 శాతం పోస్టులు ఖాళీ. ప్రొఫెసర్ల స్థాయిలో ఈ ఖాళీలు 54 శాతం. కనీసం పెరిగిన సంఖ్యకు తగినట్టయినా ప్రమాణాలు పెంచటం, పరిశోధన రంగాన్ని పటిష్ట పర్చటం, యూనివర్సిటీలను పరిశ్రమలతో అనుసంధానించటం వంటివి చేయనట్టయితే మన యువతకు బంగారు భవిష్యత్తు ఎలా? ప్రపంచశ్రేణి అభ్యసన పద్ధతుల్ని తీసుకొచ్చి మరింత సామర్థ్యంతో, లోపరహితంగా పరీక్షలు నిర్వహించటానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పడింది. అంతవరకూ ఆ బాధ్యతల్ని చూస్తున్న సీబీఎస్ఈ, ఏఐసీటీఈ, వివిధ యూనివర్సిటీలను కాదని ఎన్‌టీఏకు అప్పగించారు. సీజేపీ ఆవిర్భావానికి ఎన్‌టీఏ నిర్వాకమే దారితీసిందంటే తన కప్పగించిన బాధ్యతను అది ఎంత దివ్యంగా నిర్వహించిందో గ్రహించవచ్చు. ప్రతిభను పాడె ఎక్కించే విధానాలనూ, నిర్లక్ష్యాన్నీ, నిరాసక్తతనూ ఇప్పటికైనా ప్రభుత్వాలు విడనాడాలి. ప్రాథమిక విద్య మొదలు ఉన్నత విద్యవరకూ సమూల ప్రక్షాళనకు సంసిద్ధం కావాలి. లేనట్టయితే సాధించిన, సాధించబోయే అభివృద్ధి అర్థరహితమవుతుంది.

# ఫ్లైదుబాయ్ ఘటన.. ఉగ్రదాడే: యూఏఈ సంచలన ప్రకటన!



ఫ్లైదుబాయ్ విమాన ఘటనపై ఇప్పటివరకు ఉన్న అనుమానాలకు తెరదించే కీలక ప్రకటన వెలువడింది. కెప్టెన్ స్మిట్ మచ్చార్‌పై కాక్‌పిట్‌లోని క్రాష్ యాక్స్‌తోనే కో-పైలట్ హమామ్ అల్-హమ్మామీ దాడికి యత్నించాడని యూఏఈ తెలిపింది. అంతేకాదు.. ఈ ఘటనను ఉగ్రదాడిగా దాదాపుగా నిర్ధారించింది. దుబాయ్ నుంచి టెల్అవీవ్ వెళ్తున్న ఎఫ్‌జెడ్1073 విమానంలో కో-పైలట్ హమామ్ అల్-హమ్మామీ.. కెప్టెన్ స్మిట్ మచ్చార్‌పై కాక్‌పిట్‌లోని క్రాష్ యాక్స్‌తో దాడి చేసి, విమానాన్ని తన నియంత్రణలోకి తీసుకునేందుకు ప్రయత్నించాడని యూఏఈ ప్రాసిక్యూటర్ జనరల్ హమద్ సైఫ్ అల్ షమ్సీ శనివారం వెల్లడించారు. ఈ చర్యను 'టెర్రరిస్ట్ అటాక్'గా పేర్కొన్నారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులు, ఉద్దేశం, ఇతరులతో సంబంధాలు, ఫిజికల్-డిజిటల్ ఆధారాలపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

### విమానం కంట్రోల్ కోసం ప్రయత్నం

సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్అవీవ్ బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాక్‌పిట్‌లో కో-పైలట్ స్మిట్ మచ్చార్‌పై దాడి చేసిన అనంతరం విమాన నియంత్రణను చేపట్టేందుకు ప్రయత్నించాడని యూఏఈ అధికారులు తెలిపారు. సాధారణంగా విమానాల్లో అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే క్రాష్ యాక్స్ కాక్‌పిట్‌లోనే ఉంటుంది. అదే పరికరాన్ని దాడికి ఉపయోగించినట్లు తాజా దర్యాప్తు వివరాలు వెల్లడిస్తున్నాయి.

### వేల అడుగుల మేర ఒక్కసారిగా కిందికి

కాక్‌పిట్‌లో ఘర్షణ జరుగుతున్న సమయంలో విమానం ఒక్కసారిగా వేగంగా కిందికి దిగింది. వివిధ నివేదికల ప్రకారం విమానం దాదాపు 14 వేల నుంచి 17 వేల అడుగుల మేర ఎత్తు కోల్పోయింది. విమానంలో 170 మందికి పైగా ఉన్నారు. తీవ్రంగా గాయపడినప్పటికీ కెప్టెన్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరవగలిగారు. దీంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లి కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు.

### ఆ ఇద్దరు పైలట్లతోనే విమానం సేఫ్

విమానంలో ప్రయాణిస్తున్న ఇద్దరు ఆఫ్-డ్యూటీ పైలట్లు పరిస్థితిని చక్కదిద్దేందుకు ముందుకొచ్చారు. వారు విమాన నియంత్రణ చేపట్టి దానిని సౌదీ అరేబియాలోని టబుక్ విమానాశ్రయానికి మళ్లించారు. అక్కడ విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. ఘటన అనంతరం సౌదీ అధికారులు కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని విచారణ కోసం యూఏఈకి తరలించారు.

### హమామ్.. గతంపైనా దర్యాప్తు

కో-పైలట్‌ను హమామ్ అల్-హమ్మామీగా గుర్తించారు. అతడు ఒమన్ జాతీయుడని దర్యాప్తు వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ తెలిపింది. అతడి గత రికార్డులపైనా ఇప్పుడు అధికారులు దృష్టి పెట్టారు. 2024లో ఒమన్ ఎయిర్‌లో కో-పైలట్ ట్రైనీగా ఉన్న సమయంలో అతడి వద్ద తీవ్రవాద భావజాలానికి సంబంధించిన మెటీరియల్ లభించడంతో విమానాలు నడపకుండా నిలిపివేసినట్లు అమెరికా అధికారులు తెలిపినట్లు ఏబీసీ న్యూస్ పేర్కొంది. అయితే ఆ తర్వాత అతడు పరిపాలనా విభాగంలో కొనసాగినట్లు సమాచారం. అసలు అలాంటి నేపథ్యం ఉన్న వ్యక్తి తర్వాత ఫ్లైదుబాయ్‌లో కో-పైలట్‌గా ఎలా చేరాడు? అతడికి క్లియరెన్స్ ఎలా లభించింది? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ప్రశ్నలే ప్రస్తుతం విచారణలో కీలకంగా మారాయి.

### ఉగ్ర సంస్థలతో సంబంధాలున్నాయా?

కో-పైలట్ ఒంటరిగానే ఈ దాడికి పాల్పడ్డాడా? లేదంటే ఏదైనా తీవ్రవాద సంస్థతో సంబంధం ఉందా? ముందస్తు ప్రణాళిక ఉందా? ఎవరైనా అతడిని ప్రేరేపించారా? అనే అంశాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. యూఏఈ ప్రాసిక్యూటర్ జనరల్ ప్రకారం భౌతిక, డిజిటల్ ఆధారాలను పరిశీలిస్తున్నారు. దర్యాప్తు పూర్తయ్యాక తుది వివరాలను వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

### మచ్చార్ ధైర్యంతో తప్పిన పెను ప్రమాదం

దాడిలో తీవ్రంగా గాయపడిన కెప్టెన్ స్మిట్ మచ్చార్ మాత్రం పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ కాక్‌పిట్ తలుపు తెరిచారు. దీంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడి చేసిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకోగలిగారు. మరోవైపు ఆఫ్-డ్యూటీ పైలట్లు విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. మచ్చార్ ప్రస్తుతం కోలుకుంటున్నారు.

# పాపంపేటలో సీసీ రోడ్లకు భూమిపూజ



అనంతపురం జిల్లా/అనంతపురం రూరల్, మహి న్యూస్, అక్టోబర్ 03: రాప్తాడు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పల్లె పండుగ--3.0 కార్యక్రమంలో భాగంగా అనంతపురం రూరల్ మండలం పాపంపేట గ్రామపంచాయతీ పరిధిలోని విద్యానగర్ స్వర్ణ గ్రామం 4, 5 ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ్యురాలు పరిటాల సునీత ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, పంచాయతీ ప్రత్యేక అధికారి వెంకటనాయుడు, జేఈ శేషయ్య పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అనంతపురం రూరల్ మండల కన్వీనర్ జింక సూర్యనారాయణ, సహ క్లస్టర్ ఇన్‌చార్జి భానుకోట రామాంజనేయులు, డైరెక్టర్ సాలమ్మతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ప్రాధాన్యం ఇస్తున్నట్లు నాయకులు తెలిపారు.

# చేదుళ్లలో విబిజిరాంజీ పనులను పరిశీలించిన కలెక్టర్



### చెక్‌డ్యాం పూడికతీత పనుల తనిఖీ
### ఉపాధి కూలీలతో ముఖాముఖి

అనంతపురం, అక్టోబర్ 3: (మహి న్యూస్): బుక్కరాయసముద్రం మండలం చేదుళ్ల గ్రామంలో విబిజిరాంజీ పనులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం పరిశీలించారు. చెక్‌డ్యాం పూడికతీత పనులను తనిఖీ చేసి, అక్కడ పనిచేస్తున్న సుమారు 70 మంది ఉపాధి కూలీలతో మాట్లాడారు. కూలీలకు రోజుకు సగటున రూ.312 వరకు వేతనం లభిస్తోందని, వేతనాలు సక్రమంగా అందుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. గ్రామంలో ఆరు నెలల క్రితం సామాజిక తనిఖీ నిర్వహించినట్లు కూలీలు తెలిపారు. 125 రోజుల ఉపాధి పనులు పూర్తిచేసిన కూలీలు రైతుల సొంత బీడు భూముల్లో హాఫ్‌మూన్ పనులు చేపట్టుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కూలీలు కలెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, డ్వామా పీడీ సలీమ్ భాష తదితరులు పాల్గొన్నారు.



# బండమీదపల్లిలో పశువుల షెడ్ల నిర్మాణానికి భూమి పూజ

### పల్లె పండుగ 3.0 కింద పనులకు శ్రీకారం
### 1--2 నెలల్లో పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ ఓ. ఆనంద్
### సింగనమల మండలానికి రూ.3 కోట్ల నిధులు: ఎమ్మెల్యే శ్రావణిశ్రీ




అనంతపురం, అక్టోబర్ 3: (మహి న్యూస్): సింగనమల మండలం బండమీదపల్లి గ్రామంలో పల్లె పండుగ 3.0 కింద పశువుల షెడ్ల నిర్మాణానికి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్ భూమి పూజ చేశారు. పశువుల షెడ్లు నిర్మించుకోవడం ద్వారా పశువులకు రక్షణతో పాటు రైతులకు ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. పనులను 1--2 నెలల్లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విబిజిరాంజీ కింద సింగనమల మండలానికి సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు తాగునీరు, పాఠశాలలకు కాంపౌండ్ వాల్స్ తదితర సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు.



# నాణ్యతగా పనులు చేపట్టాలి

### చాగల్లు రిజర్వాయర్ ఓఅండ్ఎం పనులను పరిశీలించిన కలెక్టర్
### సచివాలయ సేవల్లో సంతృప్తి స్థాయి 90 శాతానికి పెంచాలి



అనంతపురం, అక్టోబర్ 3: (మహి న్యూస్): పెద్దపప్పూరు మండలం చాగల్లు రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, అమ్ఘగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దపప్పూరు సచివాలయం--1ను తనిఖీ చేసిన కలెక్టర్, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వస్తున్న సంతృప్తి స్థాయిని సమీక్షించారు. ప్రస్తుతం 77 శాతంగా ఉన్న సంతృప్తి స్థాయిని 90 శాతానికి పైగా పెంచేలా సిబ్బంది పనిచేయాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, తహసీల్దార్ బాలాజీరాజు, అధికారులు పాల్గొన్నారు.





# స్థానిక సంస్థల ఎన్నికలకు ముందస్తు చర్యలు పూర్తి చేయాలి

### ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు
### ఎన్నికల పనులపై రోజువారీ సమీక్ష



అనంతపురం, అక్టోబర్ 3: (మహి న్యూస్): రాబోయే మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ముందస్తు చర్యలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మున్సిపల్, పంచాయతీ, జిల్లా పరిషత్ అధికారులతో ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కమిషన్ సూచనలు, నిబంధనల ప్రకారం ప్రతి ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఏ పని ఎప్పటిలోగా పూర్తి చేయాలి, నిర్దేశిత నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తయిందా అనే అంశాలను రోజువారీగా సమీక్షించుకుంటూ పనులను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు, అనంతపురం మున్సిపల్ కమిషనర్ జశ్వంత్ రావు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



# గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రచార రథం ప్రారంభం

### పది రోజుల పాటు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు
### రైతులు, యువత, విద్యార్థులకు విస్తృత ప్రచారం
### కళాజాత, జానపద ప్రదర్శనలు, ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా సందేశాలు



అనంతపురం, అక్టోబర్ 3: (మహి న్యూస్): 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్' కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం రాత్రి అనంతపురం కలెక్టరేట్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాలతో పది రోజుల పాటు ఉద్యాన క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజుకు రెండు కార్యక్రమాల చొప్పున జానపద కళారూపాలు, విజయగాథలు, ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా హార్టికల్చర్ హబ్‌పై సందేశాలను ప్రజలకు చేరవేయనున్నారు. రైతులు, యువత, విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఐపీఆర్ఓ బాలకొండయ్య, ఉద్యాన శాఖ డీడీ ధనుంజయ రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీఆర్ఓ ఫక్రుద్దిన్, పీఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ

### పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార నాణ్యతపై పరిశీలన
### సరిగా ఎండార్స్‌మెంట్లు ఇవ్వకపోవడంతో ముగ్గురు అధికారులకు మెమోలు



అనంతపురం, అక్టోబర్ 3: (మహి న్యూస్): తాడిపత్రి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం తనిఖీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీల పరిష్కార నాణ్యతను పరిశీలించారు. పీజీఆర్ఎస్ అర్జీలకు సరైన ఎండార్స్‌మెంట్లు, స్పీకింగ్ ఆర్డర్లు ఇవ్వని కారణంగా మండల సర్వేయర్, తహసీల్దార్, ఎంపీడీవోలకు కలెక్టర్ మెమోలు జారీ చేశారు. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం స్పష్టమైన పరిష్కారం అందించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు స్పష్టమైన సమాచారం అందేలా ఎండార్స్‌మెంట్లు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు పక్కా ఏర్పాట్లు

### అక్టోబర్ 23న జేఎన్‌టీయూలో ప్రాంతీయ సదస్సు
### ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్‌కు ప్రత్యేక ఏర్పాట్లు
### ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశం



అనంతపురం, అక్టోబర్ 3: (మహి న్యూస్): అనంతపురం జేఎన్‌టీయూలో అక్టోబర్ 23న నిర్వహించనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్--2026 ప్రాంతీయ సదస్సుకు అన్ని ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సదస్సు సన్నద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్.. జేఎన్‌టీయూ ఎన్టీఆర్ ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అతిథి గృహంతో పాటు ఇతర ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలన్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు వసతి, భోజనం, ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్, డయాస్ తదితర ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పనులను సకాలంలో పూర్తి చేయాలని, పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాస యాదవ్, ఏపీఐఐసీ జెడ్ఎం నాగకుమార్, డీఐపీఆర్ఓ బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



# వచ్చే ఎన్నికల్లో పోటీపై మంత్రి ఉత్తమ్ కీలక ప్రకటన



హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో పోటీపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. డీలిమిటేషన్ జరిగితే తుంగతుర్తిలో పోటీ చేస్తారనే ప్రచారాన్ని ఖండించిన మంత్రి ఉత్తమ్.. హుజూర్‌నగర్ నుంచే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని తేల్చి చెప్పారు. సోషల్ మీడియా ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. తుంగతుర్తిలోని తాను పుట్టిన సొంత గ్రామం తాటి పాములలో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఉత్తమ్ పేర్కొన్నారు. కాళేశ్వరం మూడు బ్యారేజిలలో మొత్తం డిజైన్ సమస్య అయితే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందన్నారు. నిర్మాణ సంస్థలు పరిధిలో ఏదైనా సమస్యలు ఉంటే వాళ్లే నిదులు ఖర్చు చేస్తారని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# 10 నుంచి బతుకమ్మ వేడుకలు.. హైదరాబాద్ మొత్తం ఏం చేస్తున్నారంటే?



హైదరాబాద్: బతుకమ్మ పండగను ఈ నెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 18వ తేదీన సద్దుల బతుకమ్మను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలతో ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు సంజయ్ జాజు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉండే అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు. ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుంచి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఏ విధమైన ఇబ్బందులూ లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జన ఏర్పాట్లు

అదే విధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తో పాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సీఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతుండడంతో ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తుండడంతో అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు. బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈ సారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు.

# హైదరాబాద్‌లో 'విదేశీయుల'పై నజర్



హైదరాబాద్: నగరంలో అక్రమంగా ఉంటున్న విదేశీయులపై పోలీసుల నిఘా ముమ్మరమైంది. వీసా గడువు ముగిసినా నగరంలో కొనసాగుతున్న వారిని గుర్తించేందుకు స్పెషల్ బ్రాంచ్, ఎఫ్ఆర్ఆర్ఓ, స్థానిక పోలీసులు, ఐటీ సెల్ సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే 49 మంది అక్రమంగా ఉంటున్న విదేశీయులను గుర్తించి హోల్డింగ్ సెంటర్లకు తరలించగా.. 12 మందిని స్వదేశాలకు పంపించారు. తనిఖీల్లో నకిలీ కరెన్సీ, డ్రగ్స్, మోసాలు, వ్యభిచారం వంటి పలు అక్రమ కార్యకలాపాలు వెలుగులోకి రావడంతో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. టౌలిచౌకి పోలీస్ స్టేషన్-30, లంగర్ హౌస్-6, మెహదీపట్నం-6, రాజేంద్రనగర్-3, బంజారాహిల్స్-2, సైఫాబాద్-1, గుడిమల్కాపూర్-1 విదేశీయుల వివరాలు నమోదయ్యాయి. స్టూడెంట్ వీసాపై ఇండియాకు వచ్చి, వీసా గడువు ముగిసిన తర్వాత కొందరు విదేశీయులు ఆసుపత్రులకు వచ్చే విదేశీ రోగులకు అనువాదకులుగా (ట్రాన్స్‌లేటర్లు), మధ్యవర్తులుగా పనిచేస్తున్నట్లు తేలింది. వీరు రోగుల నుండి భారీగా రుసుము వసూలు చేయడమే కాకుండా, ఆసుపత్రి బిల్లులో దాదాపు 15 శాతం వరకు కమిషన్ పొందుతున్నట్లు గుర్తించారు. కొందరు విదేశీ మహిళలు వ్యభిచార కార్యకలాపాల్లో పాల్గొంటున్నట్లు వెల్లడైంది. టూరిస్ట్ వీసాపై వచ్చి గడువు ముగిసిన తర్వాత కూడా ఉంటున్న ఒక కెన్యా దేశస్తురాలు వ్యభిచారం చేస్తున్నట్లు గుర్తించారు. ఇళ్లు, ఫ్లాట్లు, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, సర్వీస్ అపార్ట్‌మెంట్లు.. విదేశీయులకు వసతి కల్పించే వారందరూ తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని పోలీసులు సూచించారు. వసతి కల్పించే ముందే విదేశీయుల పాస్‌పోర్ట్, వీసా, ఇతర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని.. విదేశీయుల నివాస సమాచారాన్ని అధికారులకు తప్పనిసరిగా సమర్పించాలన్నారు.

# చంద్రబాబూ.. మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టండి



తాడేపల్లి: హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్లంటూ చంద్రబాబు చేసిన ప్రకటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పిట్టలదొర మాటలు మానుకోవాలని సూచించారు. చంద్రబాబు డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టాలని అన్నారు. రూ. లక్ష కోట్లు కాదని, రైతులకు లక్ష మోసాలు అంటూ ట్వీట్ చేశారు. "చంద్రబాబూ.. రాయలసీమలో హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్లు అంటూ మీరు చేస్తున్నవి డ్రామాలు, అంకెలగారడీలు కాక మరేమిటి? బడ్జెట్లో కేటాయింపులు లేకుండా, ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా, రైతుల్ని ఇంతలా మభ్యపెట్టడం మీకు మాత్రమే సాధ్యం. రైతుల మీద మీ ప్రేమ, మాటలకు, ప్రచారాలకు మాత్రమే పరిమితం అని రెండున్నరేళ్ల మీ పాలనే పలుమార్లు రుజువు చేసింది. హార్టికల్చర్ సహా పంటలకు ధరల్లేక రైతులు రోడ్డున పడితే రోజూ ధర్నాలు చేస్తే మీరు ఏరోజైనా పట్టించుకున్నారా?" అని వైఎస్ జగన్ అన్నారు.

## రైతుల వెన్ను విరిచారు..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టిన ధరల స్థిరీకరణ నిధిని నిర్వీర్యంచేసి, ఉచిత పంటల బీమాను తీసివేసి రైతుల వెన్ను విరిచిన మాట వాస్తవం కాదా? అని వైఎస్ జగన్ ప్రశ్నించారు. "సున్నా వడ్డీ పథకాన్ని రద్దుచేసి, సమయానికి ఇచ్చే ఇన్‌పుట్ సబ్సిడీని నిర్వీర్యంచేసి, రైతుల నడ్డివిరిచారు. మీరు పబ్లిసిటీ డ్రామాలు చేసి, వాటినే నిజాలుగా ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తారు తప్ప, రైతుల కష్టసుఖాల గురించి ఏరోజూ పట్టించుకోరనడానికి ఇంతకన్నా సాక్ష్యం ఏం కావాలి? తీవ్రమైన కరువు కారణంగా రాయలసీమలో ఇప్పుడు తీవ్ర దుర్భిక్షం నెలకొంటే, వేలాది ఎకరాల్లో హార్టికల్చర్ తోటలు ఎండిపోతుంటే, మీరు వాటర్ మ్యాన్ అని బిల్డప్ ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఓ పక్క రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టుకు మీరే అడ్డుతగులుతున్నారు. మరొపక్క ఒక్క రాయలసీమ ప్రాంతంలోనే దాదాపుగా 7-8 లక్షల బోర్లు ఎండిపోయాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ట్యాంకర్ నీటికోసం రూ.1500 నుంచి రూ.2,000లు ఖర్చుచేసి, ఆ చెట్లను బతికించేందుకు నానా అగచాట్లు పడుతున్నా పట్టించుకోవడం లేదు. ఇక హార్టికల్చర్ హబ్ సంగతి పక్కనపెడితే, రైతుల ఆత్మహత్యలకు చిరునామాగా, రాయలసీమ సహా రాష్ట్రం మొత్తం తయారయ్యింది. చంద్రబాబూ.. మీ డ్రామాలు, బిల్డప్‌లు కట్టిపెట్టి, రైతులకు ఊరటనిచ్చేలా తక్షణమే కరువు నివారణా చర్యలు మొదలు పెట్టండి" అంటూ వైఎస్ జగన్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
ఉమ్మడి గుంటూరు జిల్లా
ఆదివారం - 04 - అక్టోబర్ - 2026

# పల్లెపల్లెన పరుగులెడుతున్న అభివృద్ధి పండుగ

## దేశానికే ఆదర్శంగా విద్యలో సంస్కరణలు..! స్థానిక ఎన్నికల్లో రప్పా.. రప్పా మూకలను తరిమికొట్టాలి..!

### ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



వెల్దుర్తి అక్టోబర్ 3:(మహి న్యూస్): పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ ఆజీవికా మిషన్ -- గ్రామీణ' పథకం నిధులతో పల్లెపల్లెన అభివృద్ధి పరుగులెడుతోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వివరించారు. శనివారం వెల్దుర్తి మండలంలో సుడిగాలి పర్యటన చేసి రూ.1 కోట్ల 30 లక్షలు విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి, భూమి పూజ చేశారు. ముందుగా గొట్టిపాళ్ల గ్రామంలో 20 లక్షలతో సీసీ రోడ్లు, శిరిగిరిపాడు గ్రామంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్లు, రచ్చమల్లపాడు గ్రామంలో రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, మండాది గ్రామంలో 40 లక్షలతో సీసీ రోడ్లకు ఎమ్మెల్యే జూలకంటి భూమి పూజలు చేసి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండాది గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

### దేశం ఏపీవైపు చూసేలా ప్రభుత్వ విద్యలో సంస్కరణలు..!

దేశానికే ఆదర్శంగా నిలిచేలా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ విద్యలో వినూత్న సంస్కరణలు తీసుకోస్తున్నారని ఎమ్మెల్యే జూలకంటి పునరుద్ఘాటించారు. ప్రజలను ఆలోచింపజేసేలా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు భావి తరాలకు బంగారు బాటలు వేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయిస్తే.., హై కోర్టులో ఆ ప్రయోజనాన్ని వైసీపీ అడ్డుకుందని మండిపడ్డారు. సుప్రీకోర్టుకు వెళ్లిన కూటమి ప్రభుత్వం బీసీలకు సామాజీక న్యాయం చేస్తోందని చెప్పారు. బీసీ సంక్షేమాన్ని గాలికొదిలేసిన జగన్ రెడ్డి .., వారిని రాజకీయంగా అణచివేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో అలజడులు సృష్టించాలని చూస్తే.., ఊరుకోను అని, చేస్తున్న అభివృద్ధిని చూసి కూటమి విజయానికి పట్టం కట్టి, రప్పా.. రప్పా మూకలను తరిమికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు గొట్టిపాళ్ల మధు, కళ్లం రామాంజిరెడ్డి, మందలపు రామకృష్ణ, జూలకంటి చిరంజీవి రెడ్డి, అక్కిరెడ్డి, పాపిరెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనధికార లేఅవుట్లు, భూములను పరిశీలించిన ఆర్డీఓ

### మాచర్ల మండలంలోని కొత్తపల్లి, ఏడో మైలు తాళ్లపల్లి గ్రామాల్లో పర్యటన



మాచర్ల అక్టోబర్ 03: ( మహి న్యూస్): మాచర్ల మండలంలోని కొత్తపల్లి, ఏడో మైలు తాళ్లపల్లి గ్రామాల్లో గురజాల ఆర్డీఓ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినట్లు గుర్తించిన లేఅవుట్లతో పాటు, ఇటీవల పత్రికల్లో వచ్చిన వార్తా కథనాలకు సంబంధించిన భూములను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత భూముల వివరాలు, లేఅవుట్లకు ఉన్న అనుమతులు, భూముల వినియోగ పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు ఏర్పాటు చేసినట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు సమాచారం. పత్రికల్లో వచ్చిన కథనాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

## 'స్టాప్ సెక్స్ సెలెక్షన్ - సేవ్ ది గర్ల్ చైల్డ్'పై విద్యార్థులకు అవగాహన

### అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి షార్ట్‌ఫిల్మ్ పోటీ

### విజేతలకు రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు



వినుకొండ, అక్టోబర్ 3: (మహి న్యూస్): బాలికల సంరక్షణ, సమానత్వం, లింగ ఎంపిక నిరోధంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు "స్టాప్ సెక్స్ సెలెక్షన్ -- సేవ్ ది గర్ల్ చైల్డ్" అంశంపై జిల్లా స్థాయి షార్ట్‌ఫిల్మ్ పోటీ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వినుకొండలోని ఎస్ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. లింగం ఆధారంగా బిడ్డను ఎంపిక చేయడం సమాజంలో అసమానతలకు దారితీస్తుందని అధికారులు తెలిపారు. బాలికలకు జీవించే హక్కు, విద్య, ఆరోగ్యం, భద్రత, సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విద్యార్థులు బాలికల పట్ల వివక్షకు వ్యతిరేకంగా, సమానత్వాన్ని ప్రోత్సహించే సందేశాలతో షార్ట్‌ఫిల్మ్‌లు రూపొందించాలని సూచించారు. పోటీలో ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందించనున్నారు. "ఆడపిల్ల పుట్టడం సమస్య కాదు.. ఆడపిల్లపై వివక్షే సమస్య" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే కార్యక్రమం ఉద్దేశమని అధికారులు తెలిపారు.



## మంచికల్లులో 30 ఏళ్ల కరెంట్ కష్టాలకు చెక్..

# కొత్త స్తంభాలు, త్రీ ఫేజ్ విద్యుత్



రెంటచింతల అక్టోబర్ 03 : (మహి న్యూస్): మంచికల్లు గ్రామంలో 30 సంవత్సరాల క్రితం వేసిన కరెంట్ స్తంభాలు శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామమంతా సింగిల్ ఫేజ్ కరెంట్ మాత్రమే రావడం, వర్షాకాలంలో స్తంభాలు షాకులు కొట్టడం, కరెంట్ లైన్లు అస్తవ్యస్తంగా వేలాడటంతో ప్రజలు భయంతో బతకాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను గత సార్వత్రిక ఎన్నికల సమయంలో మంచికల్లు గ్రామ టీడీపీ నేతలు మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఈ సమస్యను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సహకారంతో ఈరోజు మంచికల్లు గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించారు. ఎస్టీ కాలనీతో సహా గ్రామంలోని పాత స్తంభాలన్నింటినీ తొలగించి, అదే స్థానంలో కొత్త సిమెంట్ స్తంభాలను నాటుతున్నారు. అంతేకాకుండా ఇన్నాళ్లు సింగిల్ ఫేజ్ గా ఉన్న విద్యుత్ సరఫరాను త్రీ ఫేజ్ గా మారుస్తున్నారు. దీంతో గ్రామంలో లో-వోల్టేజ్ సమస్య తీరిపోనుంది. 30 ఏళ్ల సమస్యకు పరిష్కారం దొరకడంతో మంచికల్లు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రూ.20 లక్షలతో సీసీ రోడ్లకు భూమిపూజ ఇదే రోజు మంచికల్లు గ్రామంలోని ఎస్టీ కాలనీలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల నిధులతో నిర్మించనున్న రెండు సీసీ రోడ్లకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు గోగుల వెంకటరామిరెడ్డి, గోగుల పుల్లారెడ్డి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, మంచికల్లు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బుర్రిపాలెంలో పర్యటించిన మంత్రులు, కలెక్టర్

### సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

### పీఎంఏవై-గ్రామీణ్ ఇళ్లకు శంకుస్థాపనకు ఏర్పాట్లు





గుంటూరు, అక్టోబర్ 3: (మహి న్యూస్): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం బుర్రిపాలెంలో పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి హెప్సీబా రాణి కొర్లపాటి, జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ శనివారం బుర్రిపాలెంలో పర్యటించారు. అక్టోబర్ 4న ఉదయం 10.30 గంటలకు పీఎంఏవై--గ్రామీణ్ కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా గ్రామ పొలిమేరల్లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ, శంకుస్థాపన కార్యక్రమ ఏర్పాట్లను మంత్రులు, కలెక్టర్ పరిశీలించారు. ప్రజలు, అధికారులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించారు. కార్యక్రమ ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, అదనపు ఎస్పీ ఏటీవీ రవి కుమార్, జడ్పీ సీఈఓ వి. జ్యోతి బసు, ఆర్డీవోలు, డీఎస్పీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పేదల గృహ నిర్మాణంలో మరో కీలక అడుగు

### 3 లక్షల ఇళ్లకు రేపు భూమిపూజ

### తెనాలిలో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం

### 177 ఇళ్ల నిర్మాణానికి రూ.14 కోట్ల అంచనా



అమరావతి, అక్టోబర్ 3: (మహి న్యూస్): రాష్ట్రంలో మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో కలిసి ఆదివారం భూమిపూజ చేయనున్నారు. తెనాలి నియోజకవర్గం బుర్రిపాలెంలో ఈ కార్యక్రమం జరగనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 28 నెలల్లో 5.50 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్లు ప్రభుత్వం తెలిపింది. వచ్చే మార్చి నాటికి మరో 4.20 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ 2.0 కింద కేంద్రం ఇటీవల రాష్ట్రానికి 3 లక్షల ఇళ్లను కేటాయించింది.

### 3డీ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణం



తెనాలి నియోజకవర్గంలోని బుర్రిపాలెం, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో 3డీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో 177 ఇళ్లను నిర్మించేందుకు పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నారు. రూ.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్టులో వేగవంతమైన నిర్మాణం, నిర్మాణ వ్యర్థాల తగ్గింపు, నాణ్యత, దృఢత్వానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఉదయం తెనాలి చేరుకుని 3డీ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం లబ్ధిదారులతో సమావేశం, బహిరంగ సభలో పాల్గొంటారు.

## ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్ సమీక్ష

### ఎస్ఐఆర్ నోటీసులు, క్లెయిమ్స్, అభ్యంతరాలపై సమీక్ష

### పది అభ్యంతరాల పరిష్కారంపై ఈఆర్వోలతో చర్చ



నరసరావుపేట, అక్టోబర్ 3: (మహి న్యూస్): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నోటీసుల పరిశీలన, క్లెయిమ్స్, అభ్యంతరాలపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి లాగిన్‌కు వచ్చిన 10 అభ్యంతరాలను ఈఆర్వోలు ఏ విధంగా పరిష్కరించారన్న అంశంపై వివరాలు తెలుసుకున్నారు. అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అద్దయ్య, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.




## 3 లక్షల పీఎంఏవై-జీ ఇళ్లతో పాటు 3డీ హౌసింగ్ పైలట్ ప్రాజెక్ట్

### రాష్ట్రానికి 3 లక్షల ఇళ్ల కేటాయింపు

### బుర్రిపాలెంలో 100, ఓబులనాయుడుపాలెంలో 70 ఇళ్లతో 3డీ హౌసింగ్

### తక్కువ సమయంలో నిర్మాణం, వ్యయ నియంత్రణపై ప్రయోగం



తెనాలి, అక్టోబర్ 3: (మహి న్యూస్): రాష్ట్రానికి 3 లక్షల పీఎంఏవై-జీ ఇళ్ల కేటాయింపు కార్యక్రమంతో పాటు 3డీ హౌసింగ్ పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. సోషియో ఎకనామిక్ ఇండికేటర్స్ ఆధారంగా రాష్ట్రానికి సుమారు 75 వేల ఇళ్లు వచ్చే అవకాశం ఉండగా, కేంద్రంతో సమన్వయంతో 3 లక్షల ఇళ్లను సాధించగలిగామని తెలిపారు. ఈ ఇళ్లకు సంబంధించిన అధికారిక కేటాయింపు ప్రక్రియను నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక సాంకేతికతతో ఇళ్ల నిర్మాణాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టేందుకు బుర్రిపాలెంలో 100, ఓబులనాయుడుపాలెంలో 70 ఇళ్లతో మొత్తం 170 ఇళ్ల 3డీ హౌసింగ్ ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నట్లు తెలిపారు. 3డీ సాంకేతికత ద్వారా తక్కువ సమయంలో నిర్మాణం, కార్మిక వ్యయం, మెటీరియల్ వృథాను తగ్గించే అవకాశాలను పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక భౌగోళిక, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కంప్యూటర్ ఆధారిత డిజైన్‌తో నిర్మాణ విధానాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఒక 3డీ ఇంటిని నిర్మించి సాంకేతిక అంశాలను పరిశీలించినట్లు చెప్పారు. 170 ఇళ్ల ప్రాజెక్ట్ ద్వారా 3డీ హౌసింగ్‌ను ప్రయోగాత్మక స్థాయి నుంచి వాస్తవ నిర్మాణ స్థాయికి తీసుకెళ్లే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.





## అనధికార లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోవద్దు

### అనుమతులు లేని లేఔట్లపై కఠిన చర్యలు

### కొనుగోలు ముందు ఎల్‌పీ నంబర్ పరిశీలించాలి

### నిబంధనలు ఉల్లంఘిస్తే లేఔట్ల తొలగింపు



నరసరావుపేట, అక్టోబర్ 3: (మహి న్యూస్): అనధికార లేఔట్లలో ప్లాట్లు కొనుగోలు చేసి ఆర్థికంగా, చట్టపరంగా నష్టపోవద్దని సంయుక్త కలెక్టర్ సంజనా శ్రీహర్ష ప్రజలకు సూచించారు. అనుమతులు లేకుండా లేఔట్లు ఏర్పాటు చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం వినుకొండ, శావల్యాపురం మండలాల్లో పర్యటించిన సంయుక్త కలెక్టర్ అధికారులు, సిబ్బందితో కలిసి రెండు అనధికార లేఔట్లను గుర్తించి తొలగించారు. వినుకొండ మున్సిపాలిటీ పరిధిలో కారంపూడి--బ్రాహ్మణపల్లి రహదారిలో 4 ఎకరాల లేఔట్‌ను, శావల్యాపురం మండలం కనుమర్లపూడిలో 35 ఎకరాల లేఔట్‌ను తొలగించారు. వెంచర్ల వద్ద ఏర్పాటు చేసే ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సంయుక్త కలెక్టర్ సూచించారు. ప్లాట్ కొనుగోలు చేసే ముందు సంబంధిత లేఔట్‌కు అనుమతి, ఎల్‌పీ నంబర్ ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసే లేఔట్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, లేఔట్లలో ఏర్పాటు చేసిన స్తంభాలు, రోడ్లు, సరిహద్దులను సైతం తొలగిస్తామని రియల్ ఎస్టేట్ వ్యాపారులను హెచ్చరించారు.





## శాంతి, ప్రతిభ పురస్కారం అందుకున్న కె. ధనలక్ష్మి



హైదరాబాద్, మహిన్యూస్, అక్టోబర్ 03: ఇన్‌పాక్ట్ అంతర్జాతీయ శాంతి, ప్రతిభ పురస్కారం--2026ను సామాజిక కార్యకర్త కె. ధనలక్ష్మి అందుకున్నారు. వంశీ ఈవెంట్స్, మోర్డ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 2న హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ పురస్కారాన్ని స్వీకరించారు. తెలంగాణ సచివాలయంలోని సాధారణ పరిపాలన శాఖలో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ధనలక్ష్మి, ప్రస్తుతం సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. మిద్దె తోటలు, పెరటి తోటల పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. సమాజం పట్ల ఆమెకున్న నిబద్ధత, సేవలను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్‌లోని కింగ్‌కోఠి, తిలక్ రోడ్డులో ఉన్న తెలంగాణ సరస్వత పరిషత్‌లో సాయంత్రం 5 గంటలకు జరిగిన కార్యక్రమంలో ధనలక్ష్మి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు అభినందనలు తెలియజేశారు.




## 'ఇంద్రకీలాద్రి పై ప్రోటోకాల్/విఐపి దర్శనాలు నిలిపివేత '

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 3 : వరుస సెలవులు నేపథ్యం, అక్టోబర్ 02 గాంధీ జయంతి - శుక్రవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి దేవాలయం లో రద్దీ వాతావరణం నెలకొన్న పరిస్థితి రీత్యా ముందు జాగ్రత్తగా మరియు ఘాట్ రోడ్ మరామత్తు పనులు జరుగుతున్న సందర్బంగా అక్టోబర్ 4 ఆదివారం ఇంద్రకీలాద్రి పై ఉదయం 8నుండి మధ్యాహ్నం 3వరకు ప్రోటోకాల్/విఐపి దర్శనాలు పూర్తి స్థాయిలో నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో వికె శీనా నాయక్ ప్రకటించారు. అదే విధంగా కనకదుర్గనగర్ వైపు వాహనాల రాకపోకలు నియంత్రిస్తామని,బ్యాటరీ వాహనాలు వృద్ధులు, వికలాంగులు, చంటి బిడ్డల తల్లులు కోసం వినియోగించి,లిఫ్ట్ మార్గం అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఉపయోగిస్తామని, మహా మండపం ర్యాంప్ మీదుగా భక్తులు కొండపైకి చేరుకోవాలని తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, చంటి బిడ్డల తల్లులు రద్దీ లేని సమయమైన ఉదయం 8 లోపు, సాయంత్రం 3 నుండి 5 లోపు రావాలని ఈవో విజ్ఞప్తి చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థానంతో సహకరించాలని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ ),ఈవో శీనానాయక్ కోరారు.

## వైభవంగా స్వర్ణరథోత్సవం

శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 3 : ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది. కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా శనివారం వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి. అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది. సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న ఎజి రెడ్డమ్మ...



చిత్తూరు మహి న్యూస్ అక్టోబర్ 3.: చిత్తూరు 2026- 2027 సంవత్సరము గాను ఏజీ రెడ్డమ్మ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా విజేత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుండి ఎంపికై ప్రవేటు స్కూల్ అసోసియేషన్ (అపుస్మా) తరపున బెస్ట్ టీచర్ అవార్డ్ తీసుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందని తెలిపారు. డీఈవో లక్ష్మీనారాయణ మరియు స్కూల్ కరస్పాండెంట్ పి.గజేంద్ర చేతులమీదుగా తీసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఒక ఉపాధ్యాయురాలుగా నా ప్రయాణంలో విద్యార్థులకు కేవలం పుస్తకాల్లో ఉండే చదువు మాత్రమే కాకుండా వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నానని పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పవిత్రమైన వృత్తిలో ఉన్నందుకు నేను ఎల్లప్పుడూ గర్వపడతానని రెడ్డమ్మ తెలిపారు. విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గత 12 సంవత్సరాలుగా పనిచేస్తూ చేసిన సేవలు ఉత్తమ టీచర్ గా ఎంపిక చేశారు. భాస్కర హోటల్లో జరిగిన సమావేశంలో డీఈవో చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందని ఏజీ రెడ్డమ్మ తెలిపారు

## బంగారుపాళ్యంలో అన్నపూర్ణ మెడికల్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం




చిత్తూరు జిల్లా బంగారుపాలెం.మహి న్యూస్ అక్టోబర్ 3.: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాళ్యం మండలంలో అన్నపూర్ణ మెడికల్ ఽ క్లినిక్ - డాక్టర్ జి.వి. రోహిత్ ఎంబిబిఎస్ మరియు డాక్టర్ జి.వి. ప్రత్యూష ఫార్మసీ ఆధ్వర్యంలో భారీ ఉచిత వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. తిరుపతి నారాయణాద్రి హాస్పిటల్ మరియు ఆస్టర్ సంస్థ సహకారంతో ఆస్టర్ డాక్టర్ అర్జున్ ఎంబిబిఎస్ , ఆస్టర్ మౌళి మేనేజర్, సునీల్ మేనేజర్ వారి సహకారంతో ఈ శిబిరం నిర్వహించబడింది.



ఉచిత సేవలుబిపి, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు పూర్తిగా ఉచితం. ఉచిత గుండె పరీక్షలు, ఈసీజీ చేశారు. వాసన్ ఐ కేర్ - అనస్వాజ్ హాస్పిటల్ వారిచే ఉచిత కంటి పరీక్షలు, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత ఆపరేషన్లు చేయబడును. 7 రోజుల పాటు ఉచితంగా ఒపీ ఉంటుందని డాక్టర్ జి.వి. రోహిత్ ఎంబిబిఎస్ తెలియజేశారు. ఎల్లవేళలా మండలంలోని ప్రజలందరికీ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తానని, పగలు రాత్రి తేడా లేకుండా ప్రజల కోసం శ్రమిస్తానని తెలిపారు. మండలంలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుకున్నారు.

## చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### వైద్య సేవలు, మందుల పంపిణీపై పరిశీలన

### రోగులకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలి



చిత్తూరు, అక్టోబర్ 3: (మహి న్యూస్): చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ ల్యాబ్, సిటీ స్కాన్, ఫార్మసీ, ఫార్మసీ స్టోర్,



ఎంఆర్ఐ బ్లాక్, ఆపరేషన్ థియేటర్ తదితర విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా



చర్యలు తీసుకోవాలని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎంఆర్ఐ బ్లాక్, ఆపరేషన్ థియేటర్లోని సదుపాయాలను పరిశీలించి ఆసుపత్రి నిర్మాణం, నిర్వహణ అంశాలపై ఏపీఎంఎస్‌డీసీ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది, ఎస్‌టీఎఫ్ సభ్యులతో మాట్లాడారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫిమేల్) శిక్షణ పాఠశాల, హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వారి అవసరాలను తెలుసుకుని, అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

## 650 మంది విద్యార్థులకు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ

### ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం పూర్తి

### విద్యార్థులకు సర్టిఫికెట్లు, ప్రతిభ కనబరిచిన వారికి మొమెంటోలు



తిరుపతి, అక్టోబర్ 3: (మహి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో



తిరుపతిలోని శ్రీ పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో 650 మంది విద్యార్థులకు కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్‌పై ఆరు రోజుల శిక్షణ నిర్వహించారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఉద్యోగ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. భీమన్న పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.



కమ్యూనికేషన్, సాఫ్ట్, ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ విద్యార్థుల ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలకు ఉపయోగపడతాయని తెలిపారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మొమెంటోలు అందజేయగా, మిగిలిన విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు అందించారు. ఎస్‌పీడబ్ల్యూ కళాశాలలో మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఆర్. లోకనాథం, కళాశాల హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, నాంది ఫౌండేషన్ ట్రైనర్లు, ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామీణ పాత్రికేయులకు రెండో రోజు శిక్షణ తరగతులు

### ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో కొనసాగనున్న శిక్షణ

### పత్రికా భాష, ఫ్యాక్ట్ చెక్, క్రైమ్ రిపోర్టింగ్‌పై తరగతులు




తిరుపతి, అక్టోబర్ 3: (మహి న్యూస్): సీఆర్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో గ్రామీణ పాత్రికేయులకు నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణలో భాగంగా రెండో రోజు తరగతులు



అక్టోబర్ 4న కొనసాగనున్నట్లు డీఐపీఆర్వో పి. గురుస్వామి చెట్టి తెలిపారు. ఉదయం 10 నుంచి 11




గంటల వరకు సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ పత్రికా భాషపై, 11.15 నుంచి 12.15 వరకు నరేష్ నందన్ ఫ్యాక్ట్ చెక్‌పై శిక్షణ ఇస్తారు. మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 వరకు శ్రీశైలం రమేష్ క్రైమ్ రిపోర్టింగ్‌పై, 2.30 నుంచి 3.30 వరకు సోమ సుందరం గ్రామీణ వార్తలు, కథనాలపై శిక్షణ అందించనున్నారు. రెండో రోజు శిక్షణను పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని డీఐపీఆర్వో కోరారు.

## శ్రీసిటీలో బాయిలర్ పేలుడు.. ఐదుగురు మృతి

### మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారం

### ఘటనపై ప్రత్యేక విచారణకు ఆదేశం

### తిరుపతి బాయిలర్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్



శ్రీసిటీ, అక్టోబర్ 3: (మహి న్యూస్): శ్రీసిటీ పరిధిలోని టాబ్లెట్స్ ఇండియా లిమిటెడ్ పరిశ్రమలో శనివారం ఉదయం 8:30 గంటల సమయంలో 2 టన్నుల సామర్థ్యం గల బాయిలర్ పేలడంతో ఐదుగురు కార్మికులు మృతి చెందారు. మృతుల్లో బాయిలర్ ఆపరేటర్, ఇద్దరు ఈటీపీ సిబ్బంది, మరో ఇద్దరు కార్మికులు ఉన్నారు. ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు



స్పందించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించడంతో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు తదితర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 లక్షల చొప్పున పరిహారం రెండు రోజుల్లో అందించనున్నట్లు కలెక్టర్



తెలిపారు. మృతుల పిల్లల ఉన్నత విద్యతో పాటు విద్యా ఖర్చులను శ్రీసిటీ యాజమాన్యం భరించనుంది. అర్హులైన కుటుంబ సభ్యులకు శ్రీసిటీ లేదా పరిసర పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ప్రమాదంపై బాయిలర్, ఫ్యాక్టరీస్, ఇండస్ట్రీస్, పోలీస్ శాఖల



ఉన్నతాధికారులతో ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక విచారణ అనంతరం నిర్లక్ష్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోనున్నారు. విధుల్లో నిర్లక్ష్యంపై తిరుపతి బాయిలర్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల్లో వెంటనే థర్డ్‌పార్టీ సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు.

## రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి

### మార్చి 2027 నాటికి రీ-సర్వే పూర్తి చేయాలి

### పట్టాదార్ పాస్‌బుక్‌లు, మ్యుటేషన్లు, పీజీఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

### మండలాల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక



తిరుపతి, అక్టోబర్ 3: (మహి న్యూస్): జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ జీ. జయలక్ష్మి తహసీల్దార్లు, ఆర్డీవోలు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి రీ-సర్వే, పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ, మ్యుటేషన్లు, ఈ-కేవైసీ, వెబ్‌ల్యాండ్ పోస్టింగ్, పీజీఆర్ఎస్ దరఖాస్తులపై



సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 1,034 గ్రామాల్లో 15,01,809.99 ఎకరాల విస్తీర్ణంలో జరుగుతున్న రీ-సర్వేను మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిన గ్రామాలను తదుపరి దశలకు వేగంగా తరలించి వెబ్‌ల్యాండ్ పోస్టింగ్, పాస్‌బుక్‌ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. మ్యుటేషన్ కేసులను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని, పీజీఆర్ఎస్ దరఖాస్తులు ఎస్ఎల్ఏ గడువు దాటకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం 168 బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అసైన్డ్, ఫ్రీహోల్డ్, అటవీ భూములు, సదాబైనామా, స్వాధీనం తదితర క్లిష్టమైన రెవెన్యూ సమస్యలను నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం క్షేత్రస్థాయి విచారణతో పరిష్కరించాలని సూచించారు. రికార్డులను నిబంధనలకు విరుద్ధంగా మార్చరాదని స్పష్టం చేశారు. రీ-సర్వే పూర్తయిన గ్రామాలను పాస్‌బుక్ పంపిణీ సైకిళ్లతో అనుసంధానం చేసి అక్టోబర్, నవంబర్, డిసెంబర్‌లో నిర్దేశించిన గ్రామాల్లో పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలం సొంత కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.

## సాంఘిక సంక్షేమ వసతి గృహాల టెండర్ల తేదీ మార్పు

### అక్టోబర్ 5న సాయంత్రం 4 గంటలకు టెండర్ల ప్రక్రియ

### జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహణ

**తిరుపతి, అక్టోబర్ 3: (మహి న్యూస్): తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పనికిరాని వస్తువుల విక్రయానికి నిర్వహించాల్సిన టెండర్ల ప్రారంభం, ఖరారు ప్రక్రియ తేదీ మార్పు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. పాలనాపరమైన కారణాలతో సెప్టెంబర్ 30న జరగాల్సిన టెండర్ల ప్రక్రియను అక్టోబర్ 5న సాయంత్రం 4 గంటలకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్, జిల్లా కొనుగోలు కమిటీ చైర్మన్ సమక్షంలో టెండర్ల ప్రారంభం, ఖరారు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.**

## ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యం

### పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం

### వచ్చే ఏడాది 10కిపైగా రాష్ట్రస్థాయి అవార్డులే లక్ష్యం

### జిల్లా స్థాయిలో 64 స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర అవార్డులు ప్రదానం





కర్నూలు, అక్టోబర్ 2: (మహి న్యూస్): ప్రజలు పరిశుభ్రతను జీవన విధానంలో భాగంగా చేసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా స్థాయి స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో జిల్లాకు ఐదు అవార్డులు లభించాయని, వచ్చే ఏడాది 10కిపైగా అవార్డులు సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నీటి భద్రత, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ, మొక్కల పెంపకం తదితర అంశాలపై ప్రతి నెలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో భాగంగా మార్కెట్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, పబ్లిక్ టాయిలెట్లు, చెత్త పేరుకుపోయే ప్రాంతాల్లో విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. 100 కిలోలకుపైగా వ్యర్థాలు ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి అక్కడే శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను తొలగించాల్సి ఉందని, డిసెంబర్ నాటికి, గరిష్ఠంగా వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యాలు నిర్దేశించుకున్నట్లు కలెక్టర్ వివరించారు. ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్, మెటీరియల్ రికవరీ ఫెసిలిటీస్, 15 మెగావాట్ల వేస్ట్ టు వెల్త్ ప్లాంట్, సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. హంద్రీ నదిలో పేరుకుపోయిన గుర్రపుడెక్క



తొలగింపుతో పాటు శుద్ధవాగు, కేసీ కెనాల్ పరిధిలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, ప్రవర్తనలో మార్పు లేకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు పూర్తిస్థాయిలో విజయవంతం కావని స్పష్టం చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ ప్రజలు, అధికారులు, ప్రభుత్వం సమష్టిగా పనిచేసినప్పుడే కర్నూలును మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దగలమన్నారు. నగరంలో పారిశుద్ధ్య సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందని, చెత్త సేకరణను మరింత మెరుగుపరచాలని సూచించారు. అనంతరం పారిశుద్ధ్యం, స్వచ్ఛత, పరిశుభ్రత నిర్వహణలో ప్రతిభ కనబరిచిన వివిధ విభాగాలు, సంస్థలు, వ్యక్తులకు జిల్లా స్థాయిలో 64 స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర అవార్డులను కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు.

## కల్లూరు 16 వార్డులకు హ్యామ్‌తో మహర్దశ

### మౌలిక వసతుల అభివృద్ధికి రూ.116 కోట్లు

### 62.80 కి.మీ. రహదారుల అభివృద్ధి

### 14 పార్కులు, 8.50 కి.మీ. సెంట్రల్ మీడియన్ పనులు



కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మౌలిక వసతుల సమస్యలకు హైబ్రిడ్ యాన్యూటీ



మోడల్ (హ్యామ్) ద్వారా పరిష్కారం లభించనుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. కల్లూరులో హ్యామ్ పనులపై



ఇంజనీరింగ్ అధికారులు, వార్డు నాయకులతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే, కమిషనర్ పనుల ప్రాధాన్యతపై సమీక్షించారు. పనులను జాప్యం లేకుండా ప్రారంభించి, నాణ్యతతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. వీధి దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కల్లూరు అర్బన్ 16 వార్డులకు మొత్తం రూ.116 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో రూ.96.50 కోట్లతో



62.80 కిలోమీటర్ల రహదారులు, రూ.13.70 కోట్లతో 14 పార్కులు, రూ.5.80 కోట్లతో 8.50 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్ పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కర్నూలు నగరంలోని పాత 52 వార్డుల్లో మొత్తం రూ.150 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. రహదారులు, పార్కులు, సెంట్రల్ మీడియన్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను హ్యామ్ మోడల్‌లో అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు.

## 2027 సెన్సస్- కుల, మత రహితులనూ గణించాలి



హైదరాబాద్: కులం, మతం పట్టింపులేని వారి వివరాలు కూడా జనగణనలో పరిగణనలోకి తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2027 జనగణనలో కుల, మత రహితుల వివరాలు సేకరించాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ అస్తిత్వ ప్రకటన ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని దీన్ని గుర్తించి, గౌరవించాలని హైకోర్టు ద్వారా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మనదేశంలో వివిధ మత విశ్వాసాలు కలిగిన ప్రజలు మాత్రమే కాకుండా ఎటువంటి మతవిశ్వాసాలు లేని హేతువాదులు, నాస్తికులు, భౌతిక వాదులు, మానవతావాదులతో సహా కమ్యూనిస్టులూ ఉన్నారనీ.. వ్యక్తులుగా, సమూహాలుగా అనేక మంది వారి నిత్య జీవిత ఆచరణలో కుల రహిత, మత రహిత అస్తిత్వంతో ఉన్నారని పిటిషనర్లు సి. వనజ, డీవీ రామకృష్ణా రావు పేర్కొన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక సర్వేలో భాగంగా బీసీ కులగణన చేసిన నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు కుల రహితులను, మత రహితులను కూడా గణించింది. రాష్ట్రంలో 11.96 లక్షల మంది తమని తాము కుల రహితులుగా, మత రహితులుగా ప్రకటించుకున్నారు. రాష్ట్రంలో స్కూలు, కాలేజీ విద్యా స్థాయిలో డీవీ రామకృష్ణారావు, ఎస్ క్లారెన్స్ కృపాళిని దంపతులు 2010, 2017 లలో కోర్టు మెట్లు ఎక్కారు. తమ పిల్లవాడి బర్త్ సర్టిఫికెట్ కోసం డేవిడ్, రూపా దంపతులు కూడా కోర్టులో పోరాటం చేశారు. తెలంగాణలో కుల గణన సందర్భంలో కుల నిర్మూలన సంఘం వేసిన పిటిషన్‌పై వెలువడిన తీర్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కుల రహితులను, మత రహితులను గణించింది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కల్లోనూ కుల రహితులను, మత రహితులను గణించమని కోరుతూ 12 మంది వేసిన రిట్ పిటిషన్ 1420/2026, కుల నిర్మూలన సంఘం వేసిన పిటిషన్ 40062/2025 లు హైకోర్టు బెంచ్ ముందుకు రానున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా లెక్కల్లో కుల, మత రహితులను గణించమని హైకోర్టు ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని పిటిషనర్లు కోరారు.

# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం

**9 నెలల్లో 31,361 ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు నమోదు**
**డ్రంకెన్ డ్రైవింగ్‌పై 6,720 కేసులు**
**ఓపెన్ డ్రింకింగ్‌పై 11,802 కేసులు**
**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు**
**రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత: కర్నూలు పోలీసులు**



కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): రహదారి ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఐపీఎస్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 2026 జనవరి 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మొత్తం 31,361 కేసులు నమోదు చేశారు. వాటిలో ఓవర్ స్పీడ్ 6,584,





హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ 4,232, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ 1,477, డ్రంకెన్ డ్రైవింగ్ 6,720, ఓపెన్ డ్రింకింగ్ 11,802, మైనర్ డ్రైవింగ్ 83, ట్రిపుల్ డ్రైవింగ్ 463 కేసులు ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని ఎస్పీ తెలిపారు.

# సీనియర్ల వల్ల జూనియర్లకు అసౌకర్యం కలిగినా ర్యాగింగే

**ర్యాగింగ్‌పై సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు కఠినం**
**ఇంటరాక్షన్ పేరుతో ఇబ్బంది పెడితే చట్టపరమైన చర్యలు**
**విద్యార్థులు బాధ్యతాయుతంగా మెలగాలి: ఎస్పీ విక్రాంత్ పాటిల్**



కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): సీనియర్ విద్యార్థుల వల్ల జూనియర్లు ఎలాంటి అసౌకర్యానికి గురైనా అది ర్యాగింగ్ కిందికే వస్తుందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ తెలిపారు. ర్యాగింగ్‌పై సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు కఠినంగా ఉన్నాయని, విద్యార్థులు నిబంధనలు పాటించాలని సూచించారు.



కర్నూలు మెడికల్ కాలేజీలో శనివారం మెడిసిన్ ఫస్ట్ ఇయర్, సీనియర్ విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఇంటరాక్షన్ పేరుతో జూనియర్ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య వృత్తికి సమాజంలో ఎంతో గౌరవం ఉందని, ర్యాగింగ్ వంటి చర్యలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని



సీనియర్ విద్యార్థులకు సూచించారు. జూనియర్లతో సీనియర్లు స్నేహభావంతో మెలిగి వారికి సహకరించాలని తెలిపారు. ర్యాగింగ్‌కు సంబంధించిన చిన్న సంఘటన జరిగినా వెంటనే యాంటీ ర్యాగింగ్ కమిటీ, హాస్టల్ వార్డెన్ లేదా కళాశాల ప్రిన్సిపల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు 'బడ్డీ సిస్టమ్' ఏర్పాటు చేసి, సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు. అడిషనల్ సెషన్స్ కోర్టు పీపీ యు.వి. లక్ష్మి ర్యాగింగ్‌కు సంబంధించిన చట్టాలు, శిక్షలను విద్యార్థులకు వివరించారు. అడిషనల్ డీఎంఈ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి సమస్య వచ్చినా యాజమాన్యం దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థుల భద్రత కోసం ప్రత్యేక హాస్టల్ బ్లాక్‌తో పాటు రాత్రివేళల్లోనూ సిబ్బందితో పర్యవేక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధికారులు, ప్రొఫెసర్లు, పోలీసులు, సీనియర్, జూనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# చెరువులను త్వరగా నింపండి

**తాగునీటి పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి**
**హెల్త్ క్లినిక్స్, అంగన్వాడీ భవనాలు, సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలి**
**పెండింగ్ పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**



కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): జిల్లాలోని చెరువులను నీటితో నింపే ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులపై అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. జిల్లాలో తాగునీటి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. హంద్రీనీవా నీటి ప్రవాహం మరో పది రోజులు, ఎల్ఎల్‌సీ నీటి ప్రవాహం నవంబర్ 10 వరకు ఉండే అవకాశం ఉన్నందున చెరువులను త్వరగా నింపాలని ఆదేశించారు. జిల్లాలోని 35 చెరువుల్లో 18 చెరువులు ఇంకా పూర్తి స్థాయిలో నిండలేదని, వీటిలో 11 చెరువులు 75 శాతం, 5 చెరువులు 50 శాతం,



2 చెరువులు 25 శాతం నీటిమట్టంలో ఉన్నాయని తెలిపారు. వీటిని పూర్తిస్థాయిలో నింపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బోర్‌వెల్‌లను లోతుగా డ్రిల్ చేయడం, ఫిల్టర్ల మార్పు, సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్‌ను ఆదేశించారు. హెల్త్ క్లినిక్స్, అంగన్వాడీ భవనాలు, సీసీ రోడ్లు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి ముఖ్యమైన పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన అనుమతులు తీసుకుని కాంట్రాక్టర్లతో పనులు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాకు రావాల్సిన 15వ, 16వ ఆర్థిక సంఘం నిధులను త్వరగా రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రారెడ్డి, పీఆర్ ఈఈ శివసాగర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అబ్దుల్ ఖాదర్, జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ జితేంద్ర, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీధర్ మూర్తి పాల్గొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

**పెండింగ్ పనులకు గడువు నిర్ణయించి**
**వారానికోసారి సమీక్ష**
**పనుల నాణ్యతలో రాజీ వద్దు**
**డిసెంబర్ 30లోగా నిర్దేశిత పనులు పూర్తి చేయాలి**
**నగర నీటి భద్రతకు ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి**

కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): నగరంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆమె సమీక్ష నిర్వహించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని, పెండింగ్ పనులకు గడువు నిర్ణయించి వారానికోసారి పురోగతిని సమీక్షించాలని సూచించారు. డిసెంబర్ 30లోగా నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని, అవసరమైతే నాణ్యతా తనిఖీలు నిర్వహించి ప్రమాణాలు పాటించని పనులను నిలిపివేసే




చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు వివరాలు అందించాలని ఆదేశించారు. నగరానికి దీర్ఘకాలిక నీటి భద్రత కల్పించేందుకు ప్రస్తుత నీటి వనరులతో పాటు ప్రత్యామ్నాయ వనరులను కూడా పరిశీలించాలని సూచించారు. నీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. స్మార్ట్ బస్



షెల్టర్ల ఏర్పాటు, కెనాల్ పరిసరాల శుభ్రత, అమృత్--1.0 పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించే పనులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు పార్కులు, పచ్చదనం, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. నగరంలోని ప్రతి డివైడర్, మెరిడియన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి మొక్కల సంరక్షణలో లోపాలను గుర్తించాలని, నెల రోజుల్లో స్పష్టమైన మార్పు కనిపించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్-44 ఆరు లేన్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలి

**కర్నూలు-బెంగళూరు మార్గంలో 323 కి.మీ. మేర విస్తరణకు డీపీఆర్**
**కర్నూలు జిల్లాలో ఐటీసీ క్రాస్ రోడ్డు- ఉల్లిందకొండ చెక్‌పోస్ట్ వరకు 42 కి.మీ.**
**భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్, అనుమతులు త్వరగా పూర్తి చేయాలి**
**రోడ్డు భద్రతకు డీపీఆర్‌లో ప్రత్యేక ప్రాధాన్యత**

కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): జాతీయ రహదారి--44ను కర్నూలు నుంచి బెంగళూరు వరకు నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లుగా విస్తరించేందుకు రూపొందిస్తున్న డీపీఆర్‌లో క్షేత్రస్థాయి



పరిస్థితులు, స్థానిక అవసరాలు, భవిష్యత్ రవాణా అవసరాలు, రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఎన్‌హెచ్--44 ఆరు లేన్ల విస్తరణకు సంబంధించిన భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్, అనుమతులు, అంచనాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కర్నూలు నుంచి బెంగళూరు వరకు సుమారు 323 కి.మీ. మేర ఆరు లేన్ల విస్తరణకు డీపీఆర్ రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కర్నూలు జిల్లా పరిధిలో ఐటీసీ క్రాస్ రోడ్డు




నుంచి ఉల్లిందకొండ చెక్‌పోస్ట్ వరకు సుమారు 42 కి.మీ. మేర విస్తరణ ప్రతిపాదనలు ఉన్నాయని వివరించారు. భవిష్యత్ ట్రాఫిక్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆరు లేన్ల యాక్సెస్ కంట్రోల్డ్ హైవేను ప్రతిపాదించినట్లు తెలిపారు. డీపీఆర్ తుది రూపం దాల్చే ముందే అన్ని శాఖల నుంచి సాంకేతిక సమాచారం, భూవివరాలు, యుటిలిటీల వివరాలు, అనుమతులు, అంచనాలు సేకరించి ప్రతిపాదనల్లో పొందుపరచాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ దశలో మార్పులు, జాప్యాలు, అదనపు వ్యయాలు తలెత్తకుండా ముందస్తు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్‌పై దృష్టి

కర్నూలు భారత్ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్, ఉల్లిందకొండ ప్రాంతాల్లో ప్రతిపాదించిన ఫ్లైఓవర్లకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. 132 కేవీ, 11 కేవీ విద్యుత్ లైన్లు, స్తంభాల మార్పిడికి ఏపీ ట్రాన్స్‌కో, పవర్‌గ్రిడ్, ఏపీఎస్‌పీడీసీఎల్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని అంచనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. నీటి సరఫరా పైప్‌లైన్లు, ఇరిగేషన్ కాలువలు, ఓఎఫ్‌సీ కేబుల్స్ తదితర యుటిలిటీలను ముందుగానే గుర్తించి అవసరమైన షిఫ్టింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు. 2023లో రూపొందించిన అంచనాలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా పరిశీలించి అవసరమైన చోట రివైజ్డ్ ఎస్టిమేట్లు సమర్పించాలని ఆదేశించారు.

### చిన్నటేకూరు రీ-అలైన్‌మెంట్ వేగవంతం

చిన్నటేకూరు వద్ద ఉన్న సబ్‌స్టాండర్డ్ కర్వ్‌ను సరిచేసి హైవే డిజైన్ ప్రమాణాలకు అనుగుణంగా రీ--అలైన్‌మెంట్ చేపట్టేందుకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత శాఖలతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని సూచించారు. ఆరు లేన్ల హైవేపై అనధికారిక పార్కింగ్‌ను నివారించేందుకు అవసరమైన ప్రాంతాల్లో ట్రక్ లే--బైలు, రెస్ట్ ఏరియాలు, రిఫ్రెష్‌మెంట్, ఇంధన సదుపాయాలను డీపీఆర్‌లో పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు.

### రోడ్డు భద్రతకు ప్రాధాన్యత

హైవే రూపకల్పనలోనే రోడ్డు భద్రతా చర్యలను పొందుపరచాలని కలెక్టర్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక బోర్డులు, డివైడర్ ఓపెనింగ్స్, సర్వీస్ రోడ్ల అనుసంధాన ప్రాంతాల్లో ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూసేకరణ, యుటిలిటీ షిఫ్టింగ్, ఇరిగేషన్ అనుమతులు, రివైజ్డ్ ఎస్టిమేట్లు, సాంకేతిక అనుమతులను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టు పురోగతిపై జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ సునీల్‌రెడ్డి, ఎన్‌హెచ్‌ఎస్‌డీసీ సునీత, ఆర్‌వీ అసోసియేట్స్ డీపీఆర్ కన్సల్టెంట్లు వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవితేజ, సుధాకర్ తదితరులు ప్రత్యక్షంగా, ఎన్‌హెచ్--44 పీడీ తరుణ్, డీపీఆర్ భానుచందర్, డీటీసీ శాంతకుమారి, ఎస్ఈ హెచ్ఎన్ఎస్ఎస్ రాజన్‌బాబు, ఇరిగేషన్ ఎస్ఈ శైలేశ్వర్, ట్రాన్స్‌కో ఎస్ఈ ప్రదీప్‌కుమార్, ఆర్డీవో సందీప్‌కుమార్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# పార్కుల అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

**పార్కుల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలి**
**పచ్చదనం, సుందరీకరణకు ప్రాధాన్యం**
**చిన్నారులు, వృద్ధులు, మహిళలకు**
**అవసరమైన సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్ డా. ఏ.సిరి**



కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): నగరంలోని పార్కుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్స్ కాలనీలోని సంస్కృతి పార్క్, కిషన్ నగర్ పార్క్, మాధవ్ నగర్‌లోని సైన్స్ పార్క్‌లను ఆమె పరిశీలించారు. పార్కుల్లో బెంచీలు, లైటింగ్,





వ్యాయామ పరికరాలు, చిన్నారుల ఆట పరికరాలు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సూచించారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం అందేలా సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. పచ్చదనం పెంచేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, చిన్నారులు, వృద్ధులు, మహిళలు పార్కులను సద్వినియోగం చేసుకునేలా అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్

**కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహణ**
**క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ నమోదు చేసుకునే అవకాశం**
**ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలి:కలెక్టర్ డా. ఏ.సిరి**

కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సత్వర పరిష్కారం చూపేందుకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి తెలిపారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంతో పాటు రెవెన్యూ డివిజన్, మండల కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.




### క్యూఆర్ కోడ్‌తో ఫీడ్‌బ్యాక్

పీజీఆర్ఎస్ సేవలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం అనంతరం అందిన సేవలపై ప్రజలు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో తమ ఫీడ్‌బ్యాక్‌ను నమోదు చేసుకోవచ్చని వివరించారు. మొబైల్ ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన అనంతరం తెరుచుకునే పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ పేజీలో అవసరమైన వివరాలను నమోదు చేసి అభిప్రాయాన్ని సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల అభిప్రాయాల ఆధారంగా పీజీఆర్ఎస్ సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించి, సమస్య పరిష్కారంపై క్యూఆర్ కోడ్ ద్వారా తమ స్పందనను తెలియజేయాలని కలెక్టర్ డా. ఏ.సిరి కోరారు.

# అక్టోబర్ 5న పీజీఆర్ఎస్

**ఉదయం 9.30 గంటల నుంచి ప్రజల నుంచి వినతుల స్వీకరణ**
**కలెక్టరేట్‌తో పాటు మండల, రెవెన్యూ డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహణ**
**అర్జీ పరిష్కారం వివరాల కోసం 1100కు ఫోన్ చేయవచ్చు**

కర్నూలు, అక్టోబర్ 3: (మహి న్యూస్): ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అక్టోబర్ 5న సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి తెలిపారు. కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పీజీఆర్ఎస్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై వినతులు సమర్పించాలని కోరారు.

### అర్జీ పరిష్కారం వివరాలు 1100లో..

తమ అర్జీ పరిష్కారం కాకపోయినా, ప్రస్తుతం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి సమాచారం పొందవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఱ వెబ్‌సైట్ ద్వారా కూడా ప్రజలు తమ అర్జీలను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

# రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనకు పింక్ మారథాన్




నంద్యాల, అక్టోబర్ 3: (మహి న్యూస్): రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నంద్యాలలో పింక్ మారథాన్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి టెక్కె మార్కెట్ యార్డ్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ప్రారంభించి పాల్గొన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు ఆధునిక వైద్య సాంకేతికత అందుబాటులో ఉందని కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా స్వీయ పరిశీలన చేసుకోవడంతో పాటు అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఎంపీ బైరెడ్డి శబరి సూచించారు.



# జిల్లా ఆర్థికాభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలి

**రైతుల ఆదాయం పెంచే మౌలిక వసతులకు రుణాలు**
**ఎంఎస్ఎంఈలు, పీఎంఎఫ్ఎంఈ యూనిట్లకు ప్రోత్సాహం**
**అగ్రి ఇన్‌ఫ్రా, సోలార్, విద్య, హౌసింగ్‌కు ప్రాధాన్యత**



నంద్యాల, అక్టోబర్ 3: (మహి న్యూస్): జిల్లా ఆర్థికాభివృద్ధికి బ్యాంకర్లు చురుకైన భాగస్వామ్యం అందించాలని కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. కలెక్టరేట్‌లో జూన్ త్రైమాసికం 2026--27కు సంబంధించిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయం, పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు, పర్యాటకం, సేవా రంగాలకు సకాలంలో రుణాలు అందించాలని కలెక్టర్ సూచించారు. రైతుల ఆదాయం పెరిగేలా కోల్డ్‌స్టోరేజీలు, గోడౌన్లు, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ మౌలిక వసతులకు ఆర్థిక సహకారం అందించాలన్నారు. పీఎంఎఫ్ఎంఈ కింద అర్హత కలిగిన యూనిట్లకు లభించే 35 శాతం వరకు సబ్సిడీని సద్వినియోగం చేసుకునేలా మార్గదర్శకత్వం ఇవ్వాలని తెలిపారు. పశుపోషకులు, చిరు వ్యాపారులు, యువ పారిశ్రామికవేత్తలకు రుణ సహకారం అందించాలని సూచించారు. పీఎంఈజీపీ అమలులో బ్యాంకర్ల సహకారంతో 54 యూనిట్లకు ఆర్థిక సాయం అందించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విషయాన్ని కలెక్టర్ గుర్తుచేశారు. అగ్రి ఇన్‌ఫ్రా, సోలార్ ఎనర్జీ, విద్య, హౌసింగ్ రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా రూఫ్‌టాప్ సోలార్‌ను ప్రోత్సహించడంతో పాటు సైబర్ మోసాలు, ఆర్థిక అక్షరాస్యతపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ బ్యాంకర్లతో కలిసి వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# సీఎం, డిప్యూటీ సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు...!

## అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలి అధికారులకు సూచనలిచ్చిన మంత్రులు నారాయణ, ఎస్. సవిత, బీసీ జనార్దన్ రెడ్డి




కడప జిల్లా/ప్రొద్దుటూరు, అక్టోబర్ 03 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ ఈ నెల 5న ప్రొద్దుటూరు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి



చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని వారు తెలిపారు. ప్రొద్దుటూరు మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మంత్రులు నారాయణ, ఎస్. సవిత, బీసీ జనార్దన్ రెడ్డిలు.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ లతోకలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై సీఎం కార్యక్రమ సమన్వయకర్త మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, భూపేష్ రెడ్డి, జేసీ డా. నిధీమీనా, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్ గోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి క్షుణ్ణంగా వివరించారు. ఐదు ఎకరాల



విస్తీర్ణంలో శాశ్వత హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేసినట్లు, ఒకేసారి రెండు హెలికాప్టర్లు దిగే విధంగా రెండు హెలీప్యాడ్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ పరిసరాల్లో భద్రత, రాకపోకలు తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. ముఖ్యమంత్రి ప్రొద్దుటూరు పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో జల జీవన్ మిషన్‌కు సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా రూ. 30 వేల కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను కూడా కలెక్టర్ వివరించారు. అమృత్ నగర్ వద్ద హెలీప్యాడ్, అదే రోడ్డులో సర్కిల్ వద్ద రాష్ట్ర వ్యాప్తంగా రూ. 30 వేల కోట్లతో చేపట్టే "జల జీవన్ మిషన్" పనుల పైలన్, శిలాఫలకం నిర్మాణం ను, ప్రొద్దుటూరు బైపాస్--జమ్మలమడుగు మార్గంలో ఏర్పాటు చేస్తున్న ప్రజావేదిక సభా ప్రాంగణం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. సభా ప్రాంగణంలో గ్యాలరీలు,



భద్రత, నాయకుల లైన్‌అప్, బారికేడ్లు, వాహనాల రాకపోకలు, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని మంత్రులు సూచించారు. ముఖ్యమంత్రి నిర్వహించనున్న పార్టీ శ్రేణుల సమావేశానికి సంబంధించి కూడా భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, ఏపీఎస్‌పీడీసీఎల్, పీఆర్, పోలీస్ శాఖల అధికారులు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జమ్మలమడుగులో బాలబాలికల క్రీడా జట్ల ఎంపికలు



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 03: జమ్మలమడుగు డివిజన్ పరిధిలో 2026--27 విద్యా సంవత్సరానికి అండర్--14, అండర్--17 బాలబాలికల క్రీడా జట్ల ఎంపిక పోటీలు శనివారం స్థానిక పీఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించారు.



విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ ఎంపికల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ తదితర క్రీడాంశాల్లో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.





క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఇటువంటి ఎంపికలు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చాటుతూ జమ్మలమడుగు డివిజన్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర అవార్డుతో జమ్మలమడుగుకు గుర్తింపు



కడప జిల్లా/ జమ్మలమడుగు, మహి న్యూస్ అక్టోబర్ 03: స్వచ్ఛత, పారిశుద్ధ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు జమ్మలమడుగు మున్సిపాలిటీకి "స్వచ్ఛ ఆంధ్ర అవార్డ్స్--2026" జిల్లా స్థాయి పురస్కారం లభించింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నారాయణ రెడ్డి




జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందిని అభినందిస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. మున్సిపాలిటీకి లభించిన ఈ పురస్కారం పారిశుద్ధ్య సిబ్బంది, అధికారులు చేసిన కృషికి దక్కిన గుర్తింపుగా ఆయన పేర్కొన్నారు. పట్టణాన్ని మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, జంబాపురం రమణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో 5న పీజీఆర్ఎస్ రద్దు

కడప జిల్లా/కడప, మహి న్యూస్, అక్టోబర్ 03: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 5న వైఎస్సార్ కడప జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల నేపథ్యంలో పీజీఆర్ఎస్‌ను రద్దు చేసినట్లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

## మదనపల్లి హార్టికల్చర్ హబ్‌తో రైతాంగానికి ఎంతో మేలు

### గాలివీడు టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకట శివారెడ్డి



గాలివీడు:అక్టోబర్03 (మహి న్యూస్) మదనపల్లి హార్టికల్చర్ హబ్ ఏర్పాటుతో ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని గాలివీడు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకట శివారెడ్డి అన్నారు. రైతులు పండించిన పంటలకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు, గిట్టుబాటు ధరలు లభించే అవకాశం ఉంటుందన్నారు. హార్టికల్చర్ హబ్ ద్వారా పంటల సేకరణ, నిల్వ, మార్కెటింగ్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి వస్తే రైతులకు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి తగ్గుతుందని పేర్కొన్నారు. ఉద్యాన రైతుల ఆదాయం పెంపొందించేందుకు ఇటువంటి చర్యలు దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి మరిన్ని చర్యలు చేపట్టాలని వెంకట శివారెడ్డి కోరారు.

## న్యాయమూర్తులకు కంప్యూటర్ నైపుణ్యాలపై శిక్షణ



కడప, మహి న్యూస్ అక్టోబరు 03: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సూచనల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రామ్ గోపాల్ ఆధ్వర్యంలో కడప జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులకు కంప్యూటర్ నైపుణ్యాల



పెంపుదలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో కంప్యూటర్ అవలోకనం, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, రోజువారీ సాఫ్ట్‌వేర్ వినియోగం, వీడియో సమావేశాలు, కేసుల మిశ్రమ విధానంలో విచారణ, సైబర్ భద్రత, నెట్‌వర్కింగ్, సమాచార భద్రత తదితర అంశాలపై శిక్షణ అందించారు. ఉబుంటు మాస్టర్ శిక్షకులు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి జి.సి. ఆసిఫా సుల్తానా, కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి ఎస్. మధుసూదన్‌రావు శిక్షణ ఇచ్చారు. కడప న్యాయ విభాగానికి చెందిన న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## "కంప్యూటర్ నైపుణ్యాల పెంపుదల స్థాయి 1 మరియు స్థాయి 2 లపై కార్యక్రమము"



కడప మహి న్యూస్ అక్టోబర్ 3.: 03-10-2026 వ తేదీన గౌరవ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు వారి సూచనల మేరకు గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ జి.రామ్ గోపాల్ వారి ఆధ్వర్యంలో కడప యూనిట్ నందు గల జిల్లా న్యాయమూర్తులందరికీ జిల్లా కోర్టు ఆవరణంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు "కంప్యూటర్ నైపుణ్యాల పెంపుదల స్థాయి 1 మరియు స్థాయి 2 లపై కార్యక్రమము" నిర్వహించడం జరిగినది. ఈ కంప్యూటర్ నైపుణ్యాల పెంపుదల స్థాయి 1 మరియు స్థాయి 2 లపై కార్యక్రమములో కంప్యూటర్ యొక్క అవలోకనం,



ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, రోజువారీ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లతో పని చేయడం, వీడియో కాన్ఫరెన్సింగ్ మరియు కేసుల హైబ్రిడ్ విచారణ, సైబర్‌స్పేస్‌లో పని చేయడం, నెట్‌వర్కింగ్, డేటా భద్రత మొదలగు అంశాలపై ఉబంటు మాస్టర్ ట్రైనర్ మరియు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి జి సి ఆసిఫా సుల్తానా మరియు ఉబంటు మాస్టర్ ట్రైనర్ అండ్ జూనియర్ సివిల్ జడ్జ్ కమలాపురం శ్రీ ఎస్ మధుసూదన్ రావు శిక్షణ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గౌరవ న్యాయమూర్తులు అందరూ పాల్గొనడం జరిగినది.

## బయాలజీ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుకు షోకాజ్ నోటీసులు

### విచారణకు గైర్హాజరైన ఉపాధ్యాయుడు ఎంఈఓ పిల్లి నాగరాజు



గాలివీడు:అక్టోబర్03(మహి న్యూస్): విద్యార్థినితో అనుచితంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న బయాలజీ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లుకు జిల్లా విద్యాశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ-1 పిల్లి నాగరాజు తెలిపారు.విద్యార్థినితో ఉపాధ్యాయుడు వాట్సాప్‌లో చాటింగ్ చేయడం, ఫోన్ కాల్స్ మాట్లాడినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శనివారం ఎంఈఓ పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. ఘటనకు సంబంధించిన వివరాలను పాఠశాల సిబ్బంది, విద్యార్థిని కుటుంబ సభ్యుల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపారు.మూడు రోజుల్లోగా ఉపాధ్యాయుడు, విద్యార్థిని కుటుంబ సభ్యుల వివరణలను తీసుకుని, పూర్తి సమాచారంతో జిల్లా విద్యాధికారికి నివేదిక సమర్పించనున్నట్లు ఎంఈఓ వెల్లడించారు. అయితే సదరు ఉపాధ్యాయుడు సెలవులో ఉండటంతో విచారణకు హాజరు కాలేదని తెలిపారు. ఇదిలా ఉండగా, విచారణను ప్రభావితం చేసేందుకు కొందరు వ్యక్తులకు భారీగా ముడుపులు అందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## జిల్లా స్థాయి యువజనోత్సవాలు

మదనపల్లె, మహి న్యూస్, అక్టోబర్ 3 : కమీషనర్, యువజన సర్వీసుల శాఖ, విజయవాడ మరియు జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా వారి ఆదేశాల మేరకు "జిల్లా స్థాయి యువజనోత్సవాలు" 07.10.2026 వ తేదీన ఉదయం 10 గం॥ల నుండి శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, మదనపల్లె, అన్నమయ్య జిల్లా నందు స్టెప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఇదివరలో ప్రకటన చేయడం జరిగినది. కాని, కొన్ని అనివార్య కారణాల వలన సదరు కార్యక్రమము వాయిదా వేయడం జరిగినది. తదుపరి తేదీ మరియు వేదిక త్వరలో తెలియజేయబడునని స్టెప్, ముఖ్య కార్యనిర్వహణాధికారి, బి.వి. ప్రసాద రావు తెలిపారు.

## రాజ్యాంగ సవరణతో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి



విజయనగరం, మహి న్యూస్, అక్టోబర్ 03: రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రజా హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ చోడి ఆదినారాయణ డిమాండ్ చేశారు. రాజ్యాంగ సవరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లను ప్రకటించి, ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. చట్టబద్ధత లేని రిజర్వేషన్లను న్యాయస్థానాలు కొట్టివేస్తున్నాయని తెలిపారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాయకులకు చట్టబద్ధత లేని ప్రభుత్వ ఉత్తర్వులు న్యాయస్థానాల్లో నిలబడవని తెలియదా అని ప్రశ్నించారు. ఇటువంటి ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా బీసీ ప్రజలను మోసం చేసినట్లవుతుందని పేర్కొన్నారు. బీసీల పట్ల ప్రభుత్వానికి నిజమైన చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణ చేసి 34 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. ఉన్నత న్యాయస్థానంలో కొట్టివేసిన కేసులపై సర్వోన్నత న్యాయస్థానంలో అప్పీలు చేస్తామని చెప్పడం బీసీల సమస్యను కాలయాపన చేయడమేనని విమర్శించారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చోడి ఆదినారాయణ డిమాండ్ చేశారు.

# సామాన్య భక్తులే కేంద్రంగా ఉత్సవాల ఏర్పాట్లు



విజయవాడ, మహి న్యూస్, అక్టోబర్ 03 : ఈ నెల 11వ తేదీ ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి 20వ తేదీ ఆశ్వయుజ శుద్ధ దశమి వరకు జరిగే దసరా మహోత్సవాలకు వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, వారి భద్రత, సౌకర్యాలు, సులభ దర్శనానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవస్థానం ఈవో వీకే శీనా నాయక్ తెలిపారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, దేవస్థానం ఈవో శీనా నాయక్.. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, దేవాదాయ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ తదితర సమన్వయ శాఖల అధికారులతో కలిసి దసరా ఉత్సవాల ఏర్పాట్లకు సంబంధించి సంయుక్త తనిఖీలు నిర్వహించారు. సీతమ్మవారి పాదాలు, కేశఖండన శాల, హోల్డింగ్ ఏరియాలు, వినాయక టెంపుల్, రథం సెంటర్, టోల్‌గేట్, ఘాట్‌రోడ్డు మీదుగా నడుచుకుంటూ వెళ్లి ఏర్పాట్లను విస్తృతంగా పరిశీలించారు. భక్తులకు భద్రత, సౌకర్యాల కల్పనలో ఎక్కడా రాజీపడకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అనంతరం కొండపై నలుగురూ మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వినూత్న కార్యాచరణ రూపొందించామని, భక్తుల రాకపోకలు, దర్శనం, క్యూలైన్లు, పార్కింగ్, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం తదితర



అంశాలపై సమగ్ర ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులకు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించేందుకు ఏఐ ఆధారిత డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. 24 గంటలూ సేవలందించే కమాండ్ కంట్రోల్ కేంద్రాన్నిఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఘాట్ల వద్ద జల్లు స్నానాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈసారి పున్నమి ఘాట్‌లో జాతీయ సరస్ మేళా జరగనుందని.. ఈ మేళాకు గౌరవ రాష్ట్రపతి కూడా రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సీపీ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ 2024 నుంచి టెక్నాలజీకి అత్యంత ప్రాధాన్యమిస్తూ వినూత్న ప్రణాళికలతో ఏర్పాట్లు చేస్తున్నామని... ఈసారి కూడా మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బూమ్ బ్యారియర్లు, యాక్సెస్ కంట్రోలర్స్ వంటి వాటిని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. గౌరవ సీఎం వారి మార్గనిర్దేశం మేరకు సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూస్తామన్నారు. మొత్తం 22 పార్కింగ్ పాయింట్లను ఏర్పాట్లు చేశామని.. 3,500 మంది సిబ్బందితో బందోబస్తు ఉంటుందని.. యంగ్ అండ్ డైనమిక్ పోలీసులు విధుల్లో నిమగ్నమవుతారన్నారు. ఈసారి క్రౌడ్ అనలిటిక్స్‌కు ప్రాధాన్యమిస్తూ నిరంతర సమగ్ర ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వీఎంసీ ధ్యానచంద్ర.. దసరా ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను సమగ్రంగా కల్పిస్తున్నామని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచి పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛ దసరా స్ఫూర్తితో ముందడుగు వేస్తున్నామన్నారు. ఈవో వీకే శీనా నాయక్.. దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, ప్రత్యేక దర్శనాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక శోభను ప్రతిబింబించేలా ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. (సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్‌టీఆర్ జిల్లా ద్వారా జారీ)

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com